మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త

# కుంటలో పడి రైతు మృతి

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 25, ప్రభాతవార్త:** కాలువలో పడి రైతు మృతి చెందిన సంఘటన మండల పరిధి శాలిపేటలో బుధవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. శాలిపేట గ్రామానికి చెందిన రమేష్ మంగళవారం నాడు ఉదయం తన వ్యవసాయ పొలానికి వెళ్లి నీరు పెట్టి అక్కడి నుంచి పెద్దమ్మ కుంటలో చేపలు పట్టుకోస్తానని చెప్పి వెళ్లాడు. సాయంత్రి అయిన ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు కుంట వద్ద గాలించినా ఆచూకి లభించలేదు. బుధవారం ఉదయం వ్యవసాయ పోలానికి వెళ్లిన రైతు కిష్టయ్య కాలువలో పడి ఉన్న రమేష్ మృతదేహాన్ని గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. రమేష్ చేపలు పట్టడానికి పోలం గట్టుపై నుండి వెళ్తూ కాలు జారి పక్కనే ఉన్న కాలువలో బోర్లా పడటంతో ఊపిరాడక ప్రాణాలను కోల్పోయాడు. మృతుని భార్య మైసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు.

## రైతుల బలోపేతానికి సొసైటీ ఎల్లావేళలా కృషి చేస్తుంది

### పిఎసిఎస్ చైర్మన్ హరికృష్ణరెడ్డి

**తొగుట, సెప్టెంబర్ 25, ప్రభాతవార్త :** ప్రభుత్వం మూడు విడతలలో విడుదల చేసిన రుణ మాఫీని అర్హులైన 266 మంది రైతులకు ఒక కోటి 22 లక్షల 64610 అందజేయడం జరిగిందని పిఎసిఎస్ చైర్మన్ కన్నయ్యగారి హరికృష్ణరెడ్డి అన్నారు. తొగుటలోని సొసైటీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల బలోపేతానికి సొసైటీ ఎల్లావేళాల కృషి చేస్తుందన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో 501 మంది రైతులను రుణమాఫీకి అర్హులుగా గుర్తించడం జరిగిందన్నారు. రుణ మాఫీ అయిన 170 మంది రైతులకు తిరిగి ఒక కోటి 33 లక్షల రుణాలు చెల్లించడం జరిగిందన్నారు. సొసైటీలో పెండింగ్‌లో ఉన్న దీర్ఘకాలిక రుణాలను వసూలు చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు సరిపడే ఎరువులను సొసైటీలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ సీజన్‌లో 700 మెట్రిక్ టన్నుల ఎరువులను రైతులకు అందజేసినట్లు వివరించారు. ఎరువులు అవసరం ఉన్న రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ కురుమ యాదగిరి, సీఈవో గంగారెడ్డి, డైరెక్టర్ మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు

## ఉపాధ్యాయులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదు : మాజీ మంత్రి హరీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యార్థులకు విద్యాబుద్దులు నేర్పించిన గురువులను జీవితాంతం గుర్తుంచుకుంటారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ట్రెస్మా ఆధ్వర్యంలో నిర్వహించిన గురువందనం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సిఎం రేవంత్‌రెడ్డి ప్రైవేటు ఉపాధ్యాయులకు చదువురాదని చాలా తక్కువ చేసి మాట్లాడారని ఇది సరికాదన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపర్చాలి కానీ ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులపై అనుచిత వ్యాఖ్యలు చేయ డం సరికాదన్నారు. విద్య అందించడం వలనే ప్రపంచస్థాయిలో తెలుగు పిల్లలు పోటీ పడుతున్నారని తెలిపారు. ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు, బీమా సౌకర్యం కల్పించడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ట్రెస్మా ప్రతినిధులుపాల్గొన్నారు.

## ఉత్తమ సేవలు అందించిన కానిస్టేబుల్, ఎఎస్ఐకి ప్రశంసా ప్రత్రాలు అందజేత



డిజిపి నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న కానిస్టేబుల్ కవితకు

**సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 25, ప్రభాతవార్త :** రిసెప్షన్ వర్టికల్లో రాష్ట్రస్థాయిలో ఉత్తమ సేవలు అందించి 5వ స్థానం పొందిన త్రీ టౌన్ పోలీసుస్టేషన్ రిసెప్షన్ వర్టికల్ మహిళా కానిస్టేబుల్ కవిత, పౌర సేవలు(బెస్ట్ సిటిజన్ సర్వీస్) సేవలు అందించడంలో రాష్ట్ర స్థాయిలో 10 స్థానంలో నిలిచిన మద్దూరు పోలీసు స్టేషన్ ఎఎస్ఐ జగదీశ్వర్‌లకు హైదారాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో డీజీపీ జితేందర్ ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ డా॥అనురాధ మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకిత భావంతో విధులు నిర్వహించే అధికారులకు, సిబ్బందికి ఏదో ఒక రోజు తప్పకుండా గుర్తింపు వస్తుందన్నారు. సీసీటీఎన్ఎస్ డాటాను ఏ రోజు కారోజు అప్లోడ్ చేయాలని ఆ డాటా ద్వారానే జిల్లా, రాష్ట్ర, దేశ స్థాయి లో రివార్డులు, అవార్డులు ఇవ్వడం జరుగుతుందన్నారు. పోలీసు అధికారులు సిబ్బంది రాష్ట్రస్థాయిలో రివార్డులు అవార్డులు పొందే విధంగా విధులు నిర్వహించి జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన తూంకుంట ఆంక్షరెడ్డి



సిఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడుతున్న ఆంక్షరెడ్డి

**గజ్వేల్, సెప్టెంబర్ 25 (ప్రభాతవార్త):** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బుధవారం యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్ష అభ్యర్థి తూంకుంట ఆంక్షరెడ్డి హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సభ్యత్వ నమోదుపై రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన స్పందనను ఆమె సిఎం దృష్టికి తెచ్చారు. సిఎం రేవంత్‌రెడ్డి సారధ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడు తున్న సంక్షేమ పథకాలపట్ల యువత నుండి మంచి స్పందన వచ్చిందని చెప్పారు. దీంతో సిఎం రేవంత్‌రెడ్డి యూత్ కాంగ్రెస్ అధ్యక్ష అభ్యర్థి ఆంక్షరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన సభ్యత్వ నమోదు పట్ల ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రతినిధి వేం నరేందర్‌రెడ్డి, మీడియా విభాగం ఇంచార్జ్ అయోధ్యరెడ్డి, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్య క్షుడు తూంకుంట నర్సా రెడ్డి తదితరులు ఉన్నారు.

## జిల్లా మంత్రిని సన్మానించిన కాంగ్రెస్ నేత



జిల్లా ఇంచార్జి మంత్రిని సన్మానిస్తున్న నియోజకవర్గ ఇంచార్జి హరికృష్ణ

**సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 25, ప్రభాతవార్త :** జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సమీక్షించడానికి బుధవారం సిద్దిపేటకు విచ్చేసిన దేవాదాయ, ఆటవీశాఖ, జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖకు సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పూజల హరికృష్ణ ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భం గా మంత్రి కొండా సురేఖను పూజల హరికృష్ణ శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు తూంకుంట నర్సా రెడ్డి, దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

## ఇసుక లారీ సీజ్

**కోహెడ, సెప్టెంబర్ 25, ప్రభాతవార్త :** మండల పరిధిలోని శనిగరం మదిర శంకర్‌నగర్ మీదుగా ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు బుధవారం ఎస్ఐ అభిలాష్ లారీనీ సీజ్ చేసి పోలీసు స్టేషనుకు తరలించారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీనీ సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# ప్రభుత్వ పథకాలపై పూర్తి నివేదిక ఉండాలి

- అధికారులు ఏదైనా తెలియకపోతే తెలియదని చెప్పాలి..
- రైతులకు ఇబ్బందులు కల్గించవద్దు
- జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖ




మాట్లాడుతున్న జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖ్, చిత్రంలో ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై జిల్లాలోని అన్నిశాఖల జిల్లా స్థాయి అధికారుల వద్ద తమ తమ శాఖల పూర్తి నివేదిక ఉండాలి..ఎదైనా తెలియకుంటే తెలియదని చెప్పాలి తప్ప ఓవర్ యాక్షన్ చేస్తూ సభను తప్పు దోవ పట్టించాలని చూస్తే చర్యలు తప్పవని దేవాదాయ, ఆటవీశాఖ, జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని కలె క్టరేట్‌లో బుధవారం ఎమ్మెల్యేలు హరీష్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, డాక్టర్ సత్యనారాయ, ప్రభాకర్‌రెడ్డి, ఎంపి రఘునందన్‌రావు, ఎమ్మెల్సీలు శ్రీనివాస్, యాదవరెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, జిల్లా కలెక్టర్ మను చౌదరితో కలిసి జిల్లా అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమీక్షా సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్య, వ్యవ సాయ, పౌరసరఫరాలు, విద్యుత్, పంచాయతీరాజ్, వైద్యం తదితర శాఖల ప్రగతిపై ఆమె సమీక్షించి మాట్లాడారు. విధుల్లో ఎవరూ నిర్లక్ష్యంచేసిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. రైతులు బతుకు దెరువు వ్యవసాయంపై ఆధారపడి ఉంటుందని రైతులను ఇబ్బందులు పెట్టొదన్నారు. రైతులకు సరి పడా ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రభుత్వపరంగా జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బం దులు రాకుండా చూడాలని కలెక్టర్‌ను ఆదేశించారు. అర్హులైన ప్రతి రైతుకు ప్రభుత్వం రుణమాఫీ చేసిం దని ఎక్కడైనా ఏదైనా సాంకేతిక కారణాలతో రుణ మాఫీ కాకుంటే అయ్యేలా చూడాలన్నారు. రూ.2 లక్షల పైన రుణం ఉన్న రైతులు మిగతా డబ్బులు బ్యాంకుల్లో చెల్లిస్తే రూ 2 లక్షల రుణమాఫీ చేయ డానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. త్వరలో పంట నష్టం నిధులు అందిస్తామన్నారు. రైతులకు వ్యవసాయ పనిముట్లు అందించాలన్నారు. సన్న వడ్లకు మాత్రమే సబ్సిడీ రూ.500 అందిం చడం జరుగుతుందన్నారు. రాజకీయాలు చేయకుండా రైతుల అభివృద్ధికి అందరం పాటుపడుదామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. మహాలక్ష్మీ పథకం కింద గ్యాస్ సబ్సిడీ డబ్బులు రాని వారి వివరాలు సేక రించి సబ్సిడీ డబ్బులు అందేలా చూడాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో దయాలిసిస్ పేషంట్లకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా వైద్య సేవలు అం దించాలన్నారు. ప్రైవేటు అసుపత్రుల నుంచి రావా ల్సి న సిఎస్ఎఆర్ ఫండ్స్ వసూలు చేసి పేద ప్రజల వైద్య సేవలకు వినియోగించాలన్నారు. మహిళలను ఉపాధి రంగాలలో ప్రోత్సహించి ఆర్థికంగా మరింత ముందుకు తీసుకరావాలన్నారు. అభివృద్ధి విషయం లో రాజకీయాలకు అతీతంగా అందరని భాగస్వాము లను చేస్తామన్నారు.

# ధరణి పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలి

### కలెక్టర్ వల్లూరు క్రాంతి



విద్యార్థులకు పాఠాలు చెబుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

**మునిపల్లి, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలను బుధవారం జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సుడిగాలి పర్యటన చేశారు. తహసీల్దార్, పిహెచ్‌సి, మోడల్ స్కూల్, కళాశాల, డిగ్రీ కళాశాలలను కలెక్టర్ ఆకస్మి కంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠ శాల, కళాశాలల్లో ఉపాధ్యాయినిగా మారి విద్యార్థు లకు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రాంతి మాట్లాడుతూ ధరణి పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డు గదిని కలెక్టర్ పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి ఆసుపత్రిలో అందుకున్న వైద్య సేవల గురించి రోగులకు అడిగి తెలుసుకున్నారు. వర్షాలుపడుతున్నందున సీజనల్ వ్యాధులకు ప్రజలు గురికాకుండా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డేనే విధిగా నిర్వహించాలని, పరిస రాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మోడల్‌స్కూల్, బుదేరా లోని టీఎస్ డబ్లూ ఆర్ఎస్ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలను కలెక్టర్ పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థు లకు నాణ్యమైన బోధన అందించాలని పాఠశాల, కళాశాల బాధ్యులకు కలెక్టర్ సూచించారు. విద్యార్థు లకు నాణ్యమైన భోజనం అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి కలెక్టర్ సహపంక్తి భోజనం చేశారు. పాఠశాల, కళాశాల పరిసరాలను, తరగతి గదులను, కిచెన్ రూంలను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆశజ్యోతి, వైద్య అధికారులు, పంచా యతీరాజ్ అధికారులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీనియర్ ఉపాధ్యాయులనే ఎంఈవోలుగా నియమించాలి

### -టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు సంగయ్య

**కొల్చారం, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త:** చాలా కాలం తరువాత మండల విద్యాధికారులను నియమించడానికి టీపీటీఎఫ్ మెదక్ జిల్లా కమిటీ స్వాగతి స్తుందని మెదక్ జిల్లా అధ్యక్షులు సంగయ్య అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కానీ చాలా మంది సీనియర్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులను కాకుండా జూనియర్ ఉపాధ్యాయులను ఎంఈవోలుగా నియమించడం సహజ న్యాయ సూత్రాలను విస్మరించడం సరికాదన్నారు. బుధవారం ఈ విషయమై టీపీటీఎఫ్ జిల్లా కమిటీ అధ్యక్షులు సంగయ్య, ప్రధాన కార్యదర్శి వెంకట్రామి రెడ్డి జిల్లా విద్యాధికారి రాధాకిషన్‌ను కలిసి మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఝరాసంగంలో ఉపాధి హామిపై ప్రజా వేదిక

**ఝరాసంగం, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఝరాసంగంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణ లో బుధవారం ఉపాది హామి పనులపై ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వ హించారు. మండల పరిధిలోని మాచ్‌నూర్ గ్రామానికి చెందిన ప్రశాంత్ మామిడి మొక్కలు కోసం బిల్లులు ఏడాదిగా చెల్లించడం లేదని అధికారులకు వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ డిఆర్‌డిఓ బాలరాజ్, ఆయా శాఖల అధికారులు శ్రీలత, మనికుమార్, నాగేశ్వర్‌రావు, సుభాష్, సుదాకర్, రాజ్ కుమార్, శ్రీకాంత్, పంచాయితీ కార్యదర్శులు, ఉపాధి హామి ఫీల్డ్ అసిస్టెంట్లు, బిఆర్‌పిలు, విఎస్ఏలు పాల్గొన్నారు.

## మెదక్ ప్రభుత్వ మెడికల్ కళాశాల కౌన్సిలింగ్ ప్రారంభం

**మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త:** మెదక్ ప్రభుత్వ మెడికల్ కళాశాల కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభించడం జరిగిందని ప్రిన్సిపల్ రవీంద్ర తెలిపారు. బుధవారం మెదక్ వైద్య కళాశాల తరగతులకు సంబంధించి ప్రిన్సిపల్ రవీంద్ర మాట్లాడుతూ 2వ రౌండ్ నేషనల్ పూల్ కౌన్సిలింగ్‌లో 7 మంది విద్యార్థులకు గాను 4 మంది విద్యార్థులు మెదక్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఇద్దరు కేరళ నుండి, ఒకరు హర్యానా, రాజస్థాన్‌ల నుండి రావడం జరిగిందన్నారు. కళాశాలకు కావలసిన అన్ని ఫ్యాకల్టీలను రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుందన్నారు. నిరుపేదలకు వైద్యం అందించే దిశగా మెదక్ ప్రాంతంలో మెడికల్ కాలేజీని ప్రభుత్వం తరపున సంపూర్ణంగా వైద్య సేవలకు ఈ ప్రాంత వాసులు వినియోగించుకునేలా అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.

### మూడో రోజు కొనసాగిన భూనిర్వాసితుల ఆందోళన

**వర్గల్, సెప్టెంబర్ 25 (ప్రభాతవార్త):** మండలంలోని ఫుడ్‌ప్రాసెసింగ్ పరిశ్రమ ల్లో భూములు కోల్పోయిన రైతుల నిరసన కార్యక్రమం బుధవారం మూడవ రోజుకు చేరుకోగా వంటావార్పుతో నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించి రైతుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. రెవెన్యూ అధికారులు సమగ్రసర్వే నిర్వహించి అర్హులైన ప్రతిఒక్కరికి పరిహారం అందించా లన్నారు. అలాగే హెచ్ఎండిఏ అనుమతులతో కూడిన లేఔట్‌లను ఏర్పాటుచేసి ఇళ్లస్థలాలను అందించాలన్నారు. గతంలో ఇచ్చిన ఇళ్లస్థలాల సర్టిఫికెట్లలో అవకతవ కలు జరిగాయని, అర్హులైన ప్రతి ఒక్కరిని గుర్తించి ఇండ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే పరిహారం రెట్టింపుచేసి రైతులకు అందించాలని వేడుకు న్నారు. లేనిపక్షంలో కంపెనీల నిర్మాణాలను అడ్డుకుంటామని హెచ్చరించారు.

# మహిళా సాధికారతే లక్ష్యంగా ముందుకెళ్లడం శుభపరిణామం

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్




మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త:** మహిళా సాధికారతే లక్ష్యంగా జిల్లా సమాఖ్య ప్రగతి పథంలో ముందుకు పోవడం శుభపరిణామ మని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. బుధవారం మెదక్ పట్టణంలోని తెలంగాణ భవన్‌లో మెదక్ జిల్లా సమాఖ్య 7వ వార్షిక సర్వ సభ్య సమా వేశానికి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 13,063 మహిళా సంఘాల గ్రూపులు కలవని, 20 24-25 సంవత్సరంలో 214 కోట్లరుణాలు అందించడం జరిగిందని, మహిళా సంఘాల సభ్యులు 100 శాతం అక్షరాస్యత సాధించాలని, మహిళా ఆర్థిక స్వాలంబమే లక్ష్యంగా ముందుకు పోతూ సామాజిక కార్యక్రమాలు అయిన బాల్య వివాహాలు జరగకుండా చూడాలని, వరకట్న నిషేధం జరిగేలా చూడాలని అన్నారు. తీసుకున్న రుణాలు వినియోగ అవసరాలకు వాడకుండా ఆదాయాభివృద్ధి కార్యక్ర మానికి వినియోగించుకోవాలని, వచ్చిన ఆదాయంతో వినయోగ అవసరాలు తీసుకోవాలని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు వీవోల ద్వారా సమర్థవంతంగా నిర్వహించాని అన్నారు. ఈ సర్వ సభ్య సమావేశంలో 2023-24 వార్షిక సంవత్స రంలో జిల్లా సమాఖ్య ద్వారా అమలు పరిచిన కార్య క్రమాల నివేదిక చదివి వినిపించడం జరిగింద న్నారు. వార్షిక లెక్కలకు, 2024-25 వార్షిక సంవ త్సరంలో చేయబోవు ప్రణాళికకు మహాసభ ఆమో దం తెలిపిందన్నారు. అంనతరం 2023-24 వార్షిక సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన తూప్రాన్, మనోహరాబాద్, చేగుంట, నర్సాపూర్, హవేళిఘన పూర్, మెదక్ మండలాల అధ్యక్షరాళ్లను, సంబంధిత మండల ఏపీఎంలను జిల్లా కలెక్టర్ శాలువాతో సన్మానించి మెమెంటోలను అందజేశారు. ఈ కార్య క్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి సీహెచ్. శ్రీనివాస్‌రావు, అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధి కారి బి.సరస్వతి, జిల్లా మహిళా సమాఖ్య అధ్య క్షురాలు నవనీత, జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు, అసి స్టెంట్ ప్రాజెక్టు మేనేజర్లు, మండల సమాఖ్యల పదాధికారులు, జిల్లా సమాఖ్య సిబ్బంది పాల్గొన్నారు.

## 28న గౌతోజిగూడలో సాంఘిక బహిష్కరణపై రాష్ట్ర స్థాయి ఎస్సీ, ఎస్టీ కమిషన్ విచారణ

**మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త:** గౌతోజిగూడ గ్రామంలో ఉన్నత చదువులు చదువుకొని ఉద్యోగాలు చేస్తున్న దళిత యువకులు అర్జున్, చంద్రం డప్పులు కొట్టడాన్ని నిరాక రించడంతో సాంఘిక బహిష్కరణ చేసిన సంఘటనపై రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఈనెల 28న విచారణ చేయనున్నదని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, డీబీఎఫ్ నేతలు దుబాషి సంజీవ్, దాసరి ఏగోండ స్వామి, హన్మకొండ దయాసాగర్, కాళ్లకల్ నరసింహులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భాతర రాజ్యాంగ నిర్మాత కల్పించిన విద్యాహక్కు తో ఉన్న విద్యను అభ్యసించి ప్రైవేట్ ఉద్యోగాలు చేసుకుంటూ ఆత్మ గౌరవంతో జీవిస్తున్న దళిత కుటుంబాన్ని ఒంటరి చేసి సాంఘిక బహి ష్కరణ చేసిన సంఘటనపై డీబీఎఫ్ నిజ నిర్ధారణ చేసి జాతీయ ఎస్సీ కమీషన్, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమీషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. ఇందుకు స్పందించిన కమీషన్ నిందితులును అరెస్టు చేయాలని జిల్లా కలెక్టర్, ఎస్పీలను ఆదేశించిందన్నారు. ఈ సంఘటనలో అసలైన నిం దితులను నేటికి అరెస్టు చేయకుండా పోలీసులు నిర్లక్ష్యం చేస్తున్నార న్నారు. నామమాత్రంగా ముగ్గురిని మాత్రమే అరెస్టు చేశారని, అసలైన నిందితులు మాజీసర్పంచి వెంకటేశం, మాజీ ఉప సర్పంచి రేణుకుమార్ లను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మానవీయ, అవమానకర సంసఘటనపై రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకయ్య, కమీషన్ బృందం విచారణ చేసి బాధితులకు మనోధైర్యం కల్పించేందుకు ఈ నెల 28న గౌతోజిగూడకు వస్తున్నారని తెలిపారు. పోలీసులు ఇకనైనా అసలు నిందితులను అరెస్టు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. గౌతోజిగూడలో విచారణ అనంతరం మెదక్ జిల్లా కలెక్టరేట్‌లో ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడు లను జిల్లా కలెక్టర్, ఎస్పీ తదితర జిల్లా అధికారులతో సమీక్షిస్తారని వివరించారు. అనంతరం మెదక్‌లోని బాలికల గురుకుల విద్యాలయాన్ని తనిఖీచేసి విద్యాబోధన, విద్యార్థినిలసమస్యలపై ఆరాతీస్తారని తెలిపారు. వివిధ సమస్యలు ఎదుర్కొంటున్న ఎస్సీ, ఎస్టీలు జిల్లా కలెక్టరేట్‌కు వచ్చి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమీషన్‌కు ఫిర్యాదులు సమర్పించుకోవాలని శంకర్ కోరారు. ఎస్సీ,ఎస్టీ కమిషన్ పర్యటనను ఎస్సీ, ఎస్టీ సంఘాలు సద్విని యోగం చేసుకోవాలని, పర్యటనను విజయవంతం చేసి జిల్లాలో ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను కమిషన్‌కు తెలియజేయాలని కోరారు.

## పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్చొద్దు

### జిల్లా ఇన్‌చార్జి మంత్రికి వినతి పత్రం అందజేత



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఆర్యవైశ్య మహాసభ నాయకులు

**సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 25, ప్రభాతవార్త :** పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరును మార్చొద్దని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి గంప శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నాకర్, జిల్లా అధ్యక్షులు కాచం నవీన్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు గంప మహేందర్‌రావు ఆధ్వర్యంలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ పిలుపు మేరకు బుధవారం సిద్దిపేటకు విచ్చేసిన దేవాదాయ, ఆటవీశాఖ, జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా గంప శ్రీనివాస్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం పేరును తొలగించి సురవరం ప్రతాప్‌రెడ్డి విశ్వవిద్యాలం పేరు పెట్టుటకు రాష్ట్రకేబినెట్ అమోదించడంతో రాష్ట్రంలోని ఆర్యవైశ్యుల మనోభావాలు దెబ్బతింటున్నాయని.. పొట్టి శ్రీరాములు విశ్వ విద్యాల యానికి అలాగే కొనసాగించాలన్నారు. భాష ప్రాతిపదికపై రాష్ట్రాలు ఏర్పాడాలని అమరణ నిరాహార దీక్ష చేపట్టి తెలుగు రాష్ట్రాన్ని సాధించిన మహానుభావుడి పేరును మార్చడం సరికాదని ఆయన పేరును అలాగే కొనసాగించాలన్నారు. సురవరం ప్రతాప్‌రెడ్డి చేసిన సేవలకు గుర్తుగా మారేదైనా ప్రాజెక్టుకు వారి పేరు పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు లింగమూర్తి, అంజనేయులు, చంద్రశేఖర్, పుల్లూరి శివకుమార్, పాండురంగం, హరినాథ్, నగేష్, శ్రీనివాస్, గోపాల్, అంజనేయులు భద్రయ్య, రాజేంద్రప్రసాద్, బిక్షపతి, రంగయ్య, రవి, హరికిరణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మండల విద్యాధికారిగా పుష్పవేణి

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 25, ప్రభాతవార్త:** చిన్నశంకరంపేట మండల విద్యాధికారిగా పుష్పవేణి బుధవారం నాడు బాధ్యతలను స్వీకరించారు. మిర్జాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుగా పుష్పవేణి పనిచేస్తున్నారు. మండల నోడల్ అధికారిగా పనిచేస్తున్న ఆమె పూర్తిస్థాయి మండల విద్యాధికారిగా విద్యా శాఖ నుండి ఉత్తర్వులు రావడంతో ఆమె బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించడమే కృషి చేస్తున్నట్లు తెలి పారు. ఏవైన సమస్యలుంటే తనదృష్టికి తీసుకరావాలని ఆమె కోరారు.

## బతుకమ్మ కుంటలో పడి యువకుడి మృతి

**అల్లాదుర్గం, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** బతుకమ్మ కుంటలో పడి యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని చేవెళ్ల గ్రామం లో జరిగింది. ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి కథనం ప్రకారం... మూడు రోజులుగా గ్రామ శివారులోని బతుకమ్మ కుంట సమీపంలో ద్విచక్ర వాహనం ఆగి ఉంది. చెరువుకట్టపై ద్విచక్ర వాహనం ఉండటాన్ని గమనించిన గ్రామ స్థులు చెరువులో వెతికలాడగా మృతదేహం కనిపించింది. మృతుడు చేవెళ్ల గ్రామానికి చెందిన చెన్న శివకుమార్(31)గా గుర్తించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శివకుమార్ 8 నెలలుగా సంగారెడ్డి పట్టణంలోని ఒక చిట్స్‌ఫండ్‌లో పనిచేసుకుంటూ జీవనాన్ని సాగిస్తున్నాడన్నారు. 5 రోజుల క్రితం సంగారెడ్డి నుంచి స్వగ్రామానికి వచ్చి దిగులుపడుతూ ఉన్నాడని, సోమవారం ఇంటి నుంచి వెళ్లిపోయాడన్నారు. బుధవారం ఉదయం శివకుమార్ బతుకమ్మ కుంట లో శవమై కనిపించాడు. మృతుడి సోదరుడు ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు.

## కారు బోల్తా.. ఉపాధ్యాయులకు స్వల్పగాయాలు

**జోగిపేట, సెప్టెంబర్ 25, ప్రభాతవార్త:** విధులకు హాజరయ్యేందుకు వెళ్తూ కారు బోల్తాపడటంలో చిన్నపాటి ప్రమాదంతో సురక్షితంగా బయటపడిన సంఘటన మండల పరిధిలోని మాసానిపల్లి ప్రధాన రహదారిపై బుధవారం ఉదయం జరిగింది. మండల పరిధిలోని నేరెడి గుంట, అక్సాన్‌పల్లి తదితర పాఠశాలల్లో పనిచేస్తున్న పలువురు ఉపా ధ్యాయులు పాఠశాలకు వెళ్లేందుకు కారులో బయలుదేరి మాసానిపల్లి వద్దకు చేరుకోగానే అదుపుతప్పి బోల్తాకొట్టింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న ఉపాధ్యాయులు చిన్నపాటి గాయాలతో బయటపడ్డారు. వారికి జోగిపేట ప్రభుత్వ ఆసపత్రిలో చికిత్స చేసి పంపించారు. కాగా ఈ సంఘటనకు సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని జోగిపేట ఎస్ఐ పాండు తెలిపారు.



మమతను సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ తదితరులు

## మండల సమాఖ్య అధ్యక్షురాలు మమతకు సన్మానం

**నర్సాపూర్, సెప్టెంబర్ 25, ప్రభాతవార్త:** ఎంటర్ ప్రైజెస్ ను జిల్లాలో అత్యధికంగా ప్రగతిని సాధించినందులకు బుదవారం జిల్లా సమాఖ్య 7 వ సర్వసభ్య సమావేశంలో నర్సాపూర్ మండల సమాఖ్య అధ్యక్షురాలు మమతను మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ శాలువావాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఏపిఎంలు, సిసిలు, సిఏలు మండల సమాఖ్య అధ్యక్షురాలు మమతను ప్రత్యేకంగా అభినందించడం జరిగింది. ఈకార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తో పాటు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రావు, గ్రామీణ అభివృద్ధి అధికారి సరస్వతి,డిపిఎం లు, ఏపిఎం గౌరిశంకర్ తో పాటు ఏపిఎంలు, జిల్లా సమాఖ్య కార్యవర్గం, డిఆర్‌డిఏ సిబ్బంది తదితరులు పాల్గొన్నార

## దృవపత్రాల పంపిణీలో రేషన్‌డీలర్ల అలసత్వం

**హత్నూర సెప్టెంబరు 25,ప్రభాతవార్త:** రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహలక్ష్మి పథకం లబ్దిదారుల దృవపత్రాలు అందించడంలో సంబందిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని హత్నూర మండలంలోని వివిద గ్రామాల మహలక్ష్మి లబ్దిదారులు ఆరోపిస్తున్నారు. సబ్సిడిగ్యాస్‌కు అర్హులైన లబ్దిదారులకు దృవపత్రాలను రాష్ట్రప్రభుత్వం, స్థానిక మండల పరిషత్ కార్యలయానికి పంపిణి చేసిందని, లబ్దిదారులకు అందించేందుకు పంచాయతీ కార్యదర్శులకు ఇచ్చారని,వారు రేషన్‌డీలర్లకు ఇచ్చారని,ఐనా ఇప్పటికి తమకు అందలేదని వివిద గ్రామాల లబ్దిదారులు ఆరోపిస్తున్నారు.ఇప్పటికైన అధికారులు స్పందించి దృవపత్రాలు లబ్దిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఈవిషయమై హత్నూర ఎంపిడిఓ శంకర్‌ను వివరణ కోరగా మహలక్ష్మి లబ్దిదారులకు అందించాలని అయాగ్రామాల రేషన్‌డీలర్లకు ఇచ్చామని, కొన్ని చోట్ల రేషన్‌డీలర్లు పంపిణి చేయలేదనే విషయం తనదృష్టికి వచ్చిందని,వెంటనే పంపిణికి చర్యలు తీసుకుంటామని ఎంపిడిఓ తెలిపారు.

## కళాశాల అభివృద్ధికి సహకారం అందిస్తా....

**రామాయంపేట, సెప్టెంబర్ 25, ప్రభాతవార్త :** రామాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ది కోసం తన వంతు సహకారం ఎల్ల వేళలా ఉంటుందని కామారెడ్డి జిల్లా బిక్కనూరుమండలం కాచాపూర్ గ్రామ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు సుభాన్‌రెడ్డి చెప్పారు. బుధవారం కళాశాల విద్యార్థులకు పదివేల రూపాయల విలువ చేసే పరీక్ష ఆన్సర్ బుక్కులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. పేద విద్యార్థులకు తాను ఎల్లవేళలా అండగా ఉంటానని చెప్పారు. అనంతరం సుభాన్‌రెడ్డిని కళాశాల అధ్యాపక బృందం శాలువాలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హిమజ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ గూడురి మల్లేశం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి బాలాగౌడ్, అధ్యాపకులు బాలప్రకాష్, శ్రీనివాస్, ఆంజనేయులు, బాబురావు, అశోక్‌గౌడ్, సురేందర్‌రెడ్డి, యాదగిరి, మస్తాన్, సురేష్ గౌడ్, శ్రీశైలం, శ్రీదేవి, మంగ, కళాశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## నారాయనఖేడ్‌లో రాములు వర్ధంతి

**నారాయణఖేడ్ టౌన్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** పట్టణంలోని నెహ్రూ నగర్ కాలనీలో బుధవారం నిర్వహించిన ఇమ్మడి రాములు 10వ వర్ధంతి సభలో జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుజ్జపు మచ్చేందర్ పాల్గొని రాములుకు నివాళులు అర్పించారు. ఇమ్మడి రాములు కుటుం సభ్యులు ఇమ్మడి వెంకమ్మ, మాజీ వార్డు సభ్యులు ఇమ్మడి నర్సింలు, మున్సిపల్ కాంట్రాక్టర్ ఇమ్మడి మల్వేశంలకు మచ్చేందర్ సానుభూతి ప్రకటించారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు మారుతి, బాసిత్, సత్యపాల్‌రెడ్డి, రాథోడ్ లక్ష్మిబాయి రవీందర్‌నాయక్, ప్రభాకర్, పండరి యాదవ్, గంగారం ముదిరాజ్, అమృత నాయక్, కిష్టారెడ్డి, విశ్వనాథ్, జీఎంఆర్ ఫౌండేషన్ సభ్యులు హర్షవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్, పరశురాంరెడ్డి, పండరి ముదిరాజ్, జగతి రాజు షెల్గిరా తదితరులు పాల్గొన్నారు.

## ఎక్స్‌గ్రేషియా చెక్కులు అందచేసిన ఎమ్మెల్యే

**నారాయణఖేడ్ టౌన్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** తెలంగాణ స్టేట్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టిజిఎస్ పిడిసిఎల్) ఎక్స్‌గ్రేషియా తరఫున 40 వేల రూపాయలను బుధవారం ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో లబ్దిదారులకు అందచేశారు. నియోజకవర్గంలోని వాంగ్దల్ తండాకు చెందిన ఆవిచ నాయక్, పిర్లతండాకు చెందిన కర్ర హరిసింగ్, కిష్టపూర్ గ్రామానికి చెందిన మల్లొడ్డి నారాయణలకు ఎమ్మెల్యే చెక్కులను అందచేశారు. కార్యక్రమంలో మండల నాయకులు తోహెర్, పండరి రెడ్డి, రమేష్ చౌహాన్, జైపాల్, ప్రభాకర్‌రెడ్డి, తుకారాం, గుండుపాటిల్, శ్రీకాంత్‌రెడ్డి, సచిన్‌పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు పంపిణీ

**కొల్చారం, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త:** మండలానికి 76 కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులు మంజూరైనట్లు తహశీల్దార్ మహమ్మద్ గఫార్ మియా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం (నేడు) నర్సాపూర్ పట్టణంలోని సాయికృష్ణ గార్డెన్స్‌లో చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కావున లబ్దిదారులు నర్సాపూర్ పట్టణంలో నిర్వహించే కార్యక్రమానికి వచ్చి చెక్కులు తీసుకోవాలని తహశీల్దార్ గఫార్ మియా తెలిపారు.

## మండలంలో 'స్వచ్ఛతాహీ సేవా'

**వెల్దుర్తి, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన వెల్దుర్తిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం డాక్టర్ శిరీష ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రజలు ఎలాంటి అంటువ్యాధులు, ఇతర సమస్యలు వచ్చినా వైద్యులను సంప్రదించాలన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం

**వెల్దుర్తి, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కోమటిపల్లి అంగన్వాడీ కేంద్రంలో బుధవారం పోషణ మాసం కార్యక్రమం అంగన్వాడీ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో చిన్నారుల తల్లులకు పోషకాలతో కూడిన పండ్లను అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ఉపాధ్యాయురాళ్లు సావిత్రి, గౌసియా తదితరులు పాల్గొన్నారు.

## 27న ఛలో సికింద్రాబాద్

**చేర్యాల, సెప్టెంబర్ 25, ప్రభాతవార్త :** ఈనెల 27న సికింద్రాబాద్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ 6వ వార్షికోత్సవం నిర్వహిస్తున్న సందర్భంగా రాష్ట్రంలోని తెలంగాణ తొలి దశ,మలిదశ ఉద్యమకారులు అందరు హాజరు కావాలని చేర్యాల కాంగ్రెస్ పార్టీ బీసి నాయకులు అంజయ్య గౌడ్, మైనారిటి నాయకులు ఎండి.జహిరొద్దిన్ ఖాన్,సిపిఐ నాయకులు అందె అశోక్ లు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్,శ్రీధర్‌బాబు,ఎంఎల్‌సి ప్రొపెసర్ కోదండరామ్‌లు పాల్గొంటారని తెలిపారు.అదే విధంగా టీయుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాస్,జిల్లా నాయకులు పెంటం స్వామి పాల్గొననున్నట్లు వారు తెలిపారు.

## 28,29 తేదీల్లో తల్లిపాల ప్రాధాన్యతపై అంతర్జాతీయ సదస్సు

**హైదరాబాద్, సెప్టెంబరు 25,ప్రభాతవార్త:**
తల్లిపాల ప్రాధాన్యతపై ఈనెల 28,28తేదీల్లో అంతర్జాతీయ సందస్సును నిర్వహించనున్నట్లు నిర్వాహాకులు తెలిపా రు. ఈమేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పా టు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ జగదీశ్‌చంద్ర, డా. నితాషాబగ్గా, డా. దుర్గా భవాణి, డా. సంతోష్‌కుమార్‌లు కలిసి కార్యక్రమ బ్రోచర్ ఆవిష్కరించారు. ఈసం దర్భంగా వారు మాట్లాడుతూ అమీర్‌పేట్‌లోని మారిగోల్డ్ హోటల్‌లో రెండు రోజులపాటు ఈకార్యక్రమాన్ని నిర్వహిం చనున్నట్లు తెలిపారు. దీనికి నేషనల్ మెడికల్ కమిషన్ చైర్మన్ డాబిఎన్ గంగాధర్, హెల్త్‌అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆర్‌వి కర్ణన్, యునిసెఫ్ డాక్టర్ శ్రీధర్ ప్రహ్లాద్‌లు హాజరుకానున్నట్లు తెలపారు. దీనికి సుమారు 20మంది అంతర్జాతీయ ప్రతినిధులతోపాటు 500వందలమంది జాతీయ ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. రెండు రోజులపాటు 30 సెషన్లు ఉంటాయని ఈసెషన్లలో తల్లిచనుపాలు, ఆధునాతంగా ఇచ్చేవిధానం, హ్యూమన్ మిల్క్ బ్యాంకింగ్ వంటి అంశాలతో కూడిన చర్చలు ఉంటాయని పేర్కొన్నారు.

# మైనంపల్లి హన్మంతరావు భాష మార్చుకోవాలి

**జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్**



మాట్లాడుతున్న చంద్రాగౌడ్

**నర్సాపూర్, సెప్టెంబర్ 25, ప్రభాతవార్త:**
మైనంపల్లి హన్మంతరావు మాజీ మంత్రులు కెటిఆర్, హారీష్‌రావులపై అనుచిత వాఖ్యలుచేయడాన్ని తీవ్రం గా ఖండిస్తున్నామని మీరు మాట్లాడే భాష విధానం మార్చుకోవాలని జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్‌అన్నారు. బుధవారం కాంగ్రెస్ నాయకుల వాఖ్యలను ఖండిస్తు నర్సాపూర్ పట్టణం లోని క్యాంపు కార్యాలయంలో మీడియా సమావే శాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ చంద్రా గౌడ్ మాట్లాడుతూ మాజీ మంత్రి ఎమ్మెల్యే హారీష్ రావు రాష్ట్ర నాయకులు ఏ జిల్లాలో నైనా పర్యటి స్తారని అన్నారు. బిఆర్ఎస్ పార్టీకిగాని, కార్యకర్తలకు గాని ఆపద వచ్చిందంటే ఆ నియోజకవర్గాలకు వెళ్లి పరామర్శించడానికి వెళ్ళె హక్కు ఆయనకుంద న్నారు. మరి మైనంపల్లి హన్మంతరావు ఏ హోదాలో నర్సాపూర్‌నకు వచ్చి మీడియా సమావేశాన్ని నిర్వ హించారని ఆయన ప్రశ్నించారు.మేము ఉద్యమాల పురిటి గడ్డ నుండి వచ్చిన వాళ్ళం మాకు ఉద్యమాలు కొత్తేమి కావు అన్నారు, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చేవరకు ప్రజా క్షేత్రంలో పోరాటం చేస్తామన్నారు. మరోసారి మా ఆధినాయకులైన కెటిఆర్‌ను హారీష్‌రావును, ఎమ్మెల్యే సునీతారెడ్డి ల పై ఏమైనా అనుచిత వాఖ్యలు చేస్తె సహించేది లేదని ఆయన హెచ్చరించారు.ఈ కార్య క్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నహిమొద్దీన్, బిఆర్ఎస్ నాయకులు సత్యంగౌడ్, మండల పార్టీ అధ్యక్షులు బోగ శేఖర్, కౌడిపల్లి మండల అధ్యక్షులు సార రామాగౌడ్, బొడ్ల నవీన్‌గుప్త, శివకుమార్, జితేందర్‌రెడ్డి, షేక్‌హుస్సెన్, గుంజరి ప్రవీణ్ కుమార్, జగపతి, జీవన్‌రెడ్డి, బిక్కునాయక్, శ్రీనివాస్ రెడ్డి, మనోహర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సిద్ధు, సలీం, జాన్, హైమద్, మోహిన్,నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు తదితరులుపాల్గొన్నారు.

## వ్యవసాయ కళాశాలలో రక్తదాన శిబిరం

**అత్తాపూర్ సెప్టెంబరు25,ప్రభాతవార్త :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ పరిధి లోని వ్యవసాయ కళాశాల,జాతీయ సేవా పథకం విభాగం, రోటరీ క్లబ్ ,ఎంఎన్‌జె క్యాన్సర్ ఆసుపత్రి సంయుక్తంగా యూని వర్సిటీ హెల్త్ సెంటర్‌లో రక్తదాన శిబిరంను నిర్వహించారు.ఈ ప్రారంభ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రఘురామిరెడ్డి రక్తదానం యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేస్తూ వారిని ఉద్దేశిస్తూ అందరూ పెద్దలు,పిల్లలు చేసే రక్తదానం ద్వారా ఎందరికో పునర్జన్మను ప్రసాదించినవారౌ తారని వారిని ప్రోత్స హించారు.ఈ కార్యక్రమంలో డిఎస్ఎ డాక్టర్ .సత్యనారాయణ,రోటరి క్లబ్ చైర్మన్ డాక్టర్ ఎం.రామ్ ప్రసాద్,రోటరి క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్ జగదీశ్వర్,కళాశాల అసోసియేట్ డిన్ డాక్టర్ నరేంద్ర రెడ్డి,డీన్ ఆఫ్ పిజి స్టడీస్ డాక్టర్ అనిత,డైరెక్టర్ ఆఫ్ ఎక్స్టన్షన్ డాక్టర్.జమునరాణి,డిన్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్ డాక్టర్ విజయలక్ష్మి,డాక్టర్ అరుణ, ఎంఎన్‌జె క్యాన్సర్ హాస్పిటల్ డాక్టర్ .సి పద్మవేణి,ఆఫీసర్ ఇన్ చార్జీ హెల్త్ సెంటర్,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ బోధన, బోధనేతర సిబ్బంది,విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

### పాతజైలు ఖానా గోడకూలిన ఘటనలో అధికారుల పంచనామా

**కంటోన్మెంట్, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త:** మోండా మార్కెట్‌లో కూలిపోయిన టైలర్ షాపుల వద్దకు ఎమెల్యే, మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చొరవతో రెవెన్యూ అధికారులు చేరుకొని పంచనామా నిర్వహించారు. షాపులు కూలిపోయి నష్టపోయిన బాధిత కుటుంబాలను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తలసాని శ్రీనివాస్ యాదవ్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కోరారు. మంగళవారం సాయంత్రం మోండా మార్కెట్‌లోని ఓల్డ్ జైల్ ఖానా గోడకూలి పక్కనే ఉన్న 6 టైలర్ షపులపై పడిన ఘటనను ఎమ్మెల్యే తలసాని శ్రీని వాస్ యాదవ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గోడ కూలడం వల్ల తీవ్రంగా నష్టపోయారని, వారిని ఆదుకోవాలని కోరారు.స్పం దించిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బాధిత కుటుంబాలను ఆదు కో డానికి ప్రభుత్వ పరంగా కృషి చేస్తానని తెలిపారు. కాగా కలెక్టర్ ఆదేశాలతో సికింద్రాబాద్ తహసీల్దార్ పాండునాయక్ ఇతర అధికా రులు సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు.

## 5వ వార్డులో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం

**కంటోన్మెంట్, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ 5వ వార్డుకు చెందిన సామాజిక కార్యకర్త తేలుకుంట సతీష్ గుప్త ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో వాసవి కలనీ ప్రతినిధులు నాగేశ్వర్‌రావు, గంప సాయి అమర్‌నాథ్, శ్రీనివాస్, రాంబాబు, కాకేశ్, కంటోన్మెంట్ బోర్డు దఫేదార్ నరేష్ పాల్గొన్నారు.

## బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త:** లడ్డు తయారీలో జంతువుల కొవ్వులను వాడారనే వివాదంపై బుదవారం లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్ ఆధ్వర్యంలో నామాలగుండులోని వెంకటేశ్వరస్వామి ఆలయం లో ఒకరోజు దీక్షను చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీలకు అతీతంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ అత్యంత పవి త్రమైన తిరుపతి లడ్డును ప్రతి హిందువు ఎంతో పవిత్రంగా భావిస్తారని తెలిపారు. ఇలాంటి ప్రసాదంలో కూడా జంతువుల కొవ్వును కలపడం, నాణ్యతలేని నెయ్యిని వినియోగించడం దారుణమన్నారు. ఇందుకు బాధ్యులైన వారందనికి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రవిప్రసాద్ గౌడ్, రమేష్, మహేందర్ యాదవ్, కొమురయ్య, ప్రవీణ్, బాలరాజుయాదవ్, ఇతర నేతలు పాల్గొన్నారు. వెంకటేశ్వర్ రావు, కృష్ణమూర్తి, సారంపాణి, రాజు పాల్గొన్నారు.

## పేకాట ఆడుతున్న 17 మంది అరెస్ట్

**ముషీరాబాద్, సెప్టెంబర్ 25, ప్రభాతవార్త:** పేకాట ఆడుతున్న 17 మంది వ్యక్తులను ముషీరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం రాత్రి భోలక్‌పూర్‌లోని సహారా ఫంక్షన్ హాల్ నందు పేకాట ఆడుతు న్నారనే సమాచారం అందుకున్న ముషీరాబాద్ పోలీసులు సెంట్రల్ జోన్ టాస్క్ ఫోర్స్ సిబ్బందితో కలసి సోదాలు నిర్వహించగా చట్టవ్యతిరేకంగా ప్లేయింగ్ కార్డ్స్‌తో పేకాట ఆడుతున్న వ్యక్తులను గుర్తించి పట్టుకున్నారు. వారి వద్ద నుండి 70,470 రూపాయల నగదును, రెండు సెట్ల పేకలను స్వాధీ నం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

## రిటైర్డ్ పోలీసు అధికారుల సమస్యలు పరిష్కారించాలి

**సైఫాబాద్, సెప్టెంబరు 25 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉన్న వేలాది మంది రిటైర్డ్ పోలీసుల ఆరోగ్య భద్రత కోసం అందించే రెండు లక్షల బీమా సౌకర్యాన్ని ఐదు లక్షలకు పెంచాలని తెలంగాణ రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అసోసి యేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ సంఘం ఇటీవల కాలంలోనే అవిర్భవించిందని, విశ్రాంత పోలీ స్ కానిస్టేబుల్ నుంచి అధికారుల సంక్షేమం కోసం కృషి చేస్తూ వారికి అండగా నిలుస్తుందన్నారు. ఉద్యోగులు పదివి విరమణ పొందిన రోజుల పోలీస్ శాఖ నుంచి రావాల్సి న అన్ని రకాల ప్రయోజనాలను అందించి, గౌరవ ప్రదంగా పంపించాలన్నారు. విశ్రాంత ఉద్యోగులకు ఇచ్చే మెడికల్ అలవెన్స్‌లను 600 నుంచి 1000 రూపాయలకు పెంచాలని, అసోసియేషన్ రాష్ట్ర కార్యాలయం కోసం నగరంలో ఒక చోట భవనాన్ని కేటాయిం చాలని, ఆదే విధంగా రాష్ట్రంలోని 33 జిల్లా కేంద్రాలలో 300 గజాల స్థలాన్ని కేటాయించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. విశ్రాంత పోలీస్ ఉద్యోగులు ఏలాంటి సమస్యలను ఉన్న తమ అసోసియేషన్ దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. తమ సమస్యలపై త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర డిజిపిని కలిసి వినతి పత్రాలు అందిస్తామని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజమ ల్లారెడ్డి, కోశాధికారి ఖాసీంపీరా, గౌరవ అధ్యక్షులు రాధాకృష్ణ మూర్తి, సి.హెచ్.రాజమౌళిగౌడ్, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## రేపు తెలంగాణ ఉద్యమ కారులకు ఆత్మీయ సత్కారం

**సైఫాబాద్, సెప్టెంబరు 25 ప్రభాతవార్త:**
తెలంగాణ ఉద్యమ కారులకు ఈ నెల 27న సికింద్రాబాద్ లోని హరిహర కళాభవన్‌లో ఆత్మీయ ఘన సత్కారం నిర్వ హిస్తున్నామని తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం తెలిపింది. ఈ మేరకు బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫోరం చైర్మన్ డాక్టర్ చీమా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పటోళ్ల సురేందర్ తదితరులు ఈ ఆత్మీయ సత్కారానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవి ష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధు లుగా టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, టిజెఎస్ అధినేత, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, చామల కిరణ్‌కు మార్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న (నవీన్), విమలక్క, దిలీప్‌కుమార్, వెన్నల గద్దర్ తదితరులు పాల్గొంటారని వారు తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని, ఉద్యమ కారులను గుర్తించ దానికి ఒక కమిటీని నియమించాలని, గుర్తింపు కార్డులు పంపిణి చేయాలని, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఫోరం నాయ కులు కొంతం వీరస్వామి, బి.ఇంద్రకుమార్, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## గువాహటినగరంలో నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి పర్యటన

**తార్నాక, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త:** జీహెచ్ఎంసీ అధికారిక అధ్యయన పర్యటనలో భాగంగా గ్రేటర్ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి కార్పోరేటర్లు, అధికారులతో కలిసి గువాహటి మున్సిపల్ కార్పోరేషన్ డంపింగ్ స్టేషన్‌ను సందర్శించారు. డంప్ యార్డ్‌ను ప్రాసెస్ చేసే సంస్థ అక్కడ చెత్తను ఎలా శుద్ధి చేస్తుందో వారు అనుసరి స్తున్న పద్ధతులను, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగు ణంగా వారు ఎలా చేస్తున్నారో వివరించారు. ల్యాండ్ ఫిల్లిం గ్‌ని ప్రామాణిక విధానాలను అనుసరించి పూర్తి చేశారు. అనంతరం అక్కడి నగరంలో సాగుతున్న అద్భుతమైన అభివృద్ధి పనులను కూడా సమీక్షించారు. నగరంలో చెత్త నిర్వాహణలో అవలంబిస్తున్న నూతన సాంకేతిక పద్ధతుల ను అడిగి తెలుసుకున్నారు. గువాహటి మున్సిపల్ కార్పోరే షన్, జిగ్మా గ్లోబల్ సంస్థల మధ్య సమన్వయం ద్వార చేపట్టబడిన ఈ ప్రాజెక్టు ఇతర నగరాలకు కూడా ఒక ఆదర్శంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# మూసీ ప్రక్షాళనకు ప్రభుత్వం చర్యలు

**-అర్హులైన పేదలకు డబుల్ బెడ్ ఇళ్లు**
**-రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక**



**అత్తాపూర్ సెప్టెంబరు25,ప్రభాతవార్త :**
మూసి ప్రక్షాళనకు ప్రభుత్వం చర్యలు చేపట్టినందున మూసి పరివాహక ప్రాంతంలోని అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించేందుకు వివరాలు సేకరించాలని మూసి పరివాహక ప్రాంతంలో నివసించే వారికి భరోసా కల్పించేందుకు అధికారులు వారికి నచ్చ చెప్పాలని కలెక్టర్ శశాంక ఆదేశించారు.బుధవారం రాజేంద్రనగర్ మండల రెవెన్యూ కార్యాలయంలో మూసి పరివాహక ప్రాంత అభివృద్ధి,అక్రమ నిర్మాణాల తొలగింపుపై జిల్లా కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ....జిల్లాలోని గండిపేట్,రాజేంద్రనగర్ మండలాల్లోని మూసి పరివాహక ప్రాంతాలలో 332 అక్రమ నిర్మాణాలను గుర్తించడం జరిగిందని తెలిపారు.గండిపేట్ మండలంలో 32 నిర్మాణాలు ,రాజేంద్రనగర్ మండలంలో 300 నిర్మాణాలు,మూసి నది పరివాహక ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తించామని మొత్తం 332 నిర్మాణాలను తొలగించవలసి ఉన్నాయని తెలిపారు.వారికి మరోచోట డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించడం జరుగుతుందని అన్నారు.మొదటగా నాలుగు బృందాలను ఏర్పాటు చేసి మూసి పరివాహక ప్రాంతంలో ఆక్రమ నిర్మాణాల్లో ఉంటున్న వారికి ఎప్పటికైనా ఈ ఆక్రమ నిర్మిణాలు ఉండవని వారికి శాశ్వత నిర్మాణాలు గల ఇళ్లు డబులు బెండ్ రూమ్ ఇళ్లు ఇవ్వనున్నట్లు అధికారులు నచ్చేజెప్పాలని సూచించారు.ఈ టిలంలో పోలీసు,రెవెన్యూ,మున్సిపల్ ,సర్వే డిపార్ట్‌మెంట్ ఇతర సిబ్బంది 8 నుండి 10 మంది టీమ్‌లుగా వెళ్లి ఇంటి యజమానికి సంబంధించిన ఆధార్ కార్డు,ఇంటికి సంబంధించిన పేపర్లు ,కరెంట్ బిల్స్ ,అనుమతులు తదితర డాటాను సేకరించాలని సూచించారు.ఇప్పుడు ఉంటున్న ఇళ్లు వరదల ముప్పు ఉంటుందని ఎప్పటికైనా నివాసాలకు అనువుగా ఉండదని వారికి తెలియజేయాలని అన్నారు.వీరికి ఇచ్చే డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల డ్రా ను వారి చేతనే తీయించడం జరుగుతుందని ఖాళీ చేయించు సమయంలో రవాణా ఖర్చు కూడా ప్రభుత్వమే భరిస్తుందని తమ పరిధిలో కేటాయించిన ప్రాంతంలోని ఆక్రమణదారులను పిలిచి వారికి అన్ని విధాల ప్రభుత్వం అండగా ఉంటుందని నచ్చజెప్పాలని అన్నారు.మూసి పరివాహక ప్రాంతాల్లో నివాసాలు కమర్షియల్ ఆక్రమణలు ఏ మేరకు ఉన్నాయో వివరాలు సేకరించాలని అన్నారు.పోలీస్ శాఖ నుండి సరైన సహకారం కల్పించాలని పోలీస్ వారికి కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతీమా సింగ్,మూసి రివర్ డెవలప్మెంట్ అథారిటి జాయింట్ ఎండి గౌతమి,రాజేంద్రనగర్ ఆర్డిఓ వెంకటరెడ్డి,డిసిపి శ్రీనివాస్,ఎసిపి శ్రీనివాస్,మూసి రివర్ డెవలపర్ ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి,రాజేంద్రనగర్ మున్సిపల్ కమిషనర్ రవి కుమార్,నార్సింగ్ మున్సిపల్ అధికారులు,ఎమ్మార్వో రాములు,నాలుగు బృందాలు డిప్యూటీ తహసీల్దార్లు,తదితరులు పాల్గొన్నారు.

## పంటలకు తెగుళ్లు తగలకుండా పంటలను కాపాడుకోవాలి

**కొండపాక, సెప్టెంబర్ 25, ప్రభాతవార్త :** మండల పరిధిలోని మర్పడ్గ గ్రామంలో గజ్వేల్ డివిజన్ ఎడిఎ బాబునాయక్, ఎఓ శివరామకృష్ణతో కలిసి బుదవారం పత్తి, వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఆగస్టు నెల చివరలో, సెప్టెంబర్ మొదటి వారంలో కురిసిన బారీవర్షాల కారణంగా పంటలకు చీడపీడల బెడద పెరుగుతుందని రైతులకు తగు సూచనలను, సలహాలను ఇచ్చారు. వరి పంటలో బ్యాక్టీరియా ఎండాకు తెగులుకు కాపర్ అక్సిక్లోరైడ్, 13,0,45 వేసుకోవాలని, పత్తిలో రసం పీల్చి పురుగులు ఎక్కువగా ఉండడంతో వాటికి ఇమిడక్లోపెడ్ 80 మెల్ ఎకరానికి డిఫెంతిరోన్ 250 గ్రాములు వేసుకోవాలని సూచించారు. వరిలో అశించే వరి కంకి నల్లికి ఓవరాన్ 100 ఎంఎల్ ఎకరానికి వాడాలని సూచించారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో వైద్య పరీక్షలు

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 25,ప్రభాతవార్త:** పిల్లలకు తప్పకుండా పౌష్టికాహారం తినిపించాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ తెలిపారు. బుధవారం మండల పరిధి కొర్విపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎత్తు,బరువు తక్కువ ఉన్న పిల్లల్ని గుర్తించి వారికి మందులను అందించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ కుమారి, ఏఎన్ఎం ప్రియాంక, మంగమ్మ, మంజూలాలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులకు బదీలిలు సహజం

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 25,ప్రభాతవార్త:** ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో బదిలి అనేది సహజమని మండల వైద్యాధికారి సాయి సింధూ అన్నారు. బుధవారం నాడు మండల వైద్య అరోగ్య కేంద్రంలోని ఫార్మసిస్ట్ రాజేష్, ప్రయోగశాల నిపుణుడు దేవిడ్ యూడీసీ శ్రీనివాసులు బదిలిపైవెళ్లగా వారిని శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఆమె మాట్లాడుతూ ఉద్యోగులు పనిచేసేచోట ఎంతో అంకిత భావంతో విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలన్నారు.కార్యక్రమంలో వైద్యురాలు హారిక, సిబ్బంది పాల్గొన్నారు.

## పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

**చిన్నశంకరంపేట,సెప్టెంబర్ 25,ప్రభాతవార్త:** పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటామని వైద్యాదికారి సాయి సింధూ అన్నారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని పారిశుద్ధ కార్మికులకు వైద్య పరీక్షలను నిర్వహించి వారికి మందులను అందించారు. చేతి తొడుగులను వేసుకొని చెత్తను తీయాలని సూచించారు. సబ్బుతో చేతులను శుభ్రంగా కడుక్కోవాలన్నారు. స్వచ్ఛత, పరిశుభ్రతపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని తెలిపారు. పరిసరాల పరిశుభ్రత అందిరి బాధ్యత అని ఆమె అన్నారు. ఆమె వెంట వైద్య సిబ్బంది ఉన్నారు.

## మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలి

**బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి మల్లిఖార్జునరెడ్డి**

**హుస్నాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని అన్ని మార్కెట్ కమిటీలను ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లిఖార్జునరెడ్డి డిమాండ్ చేశారు.బుధవారం రోజున పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ నుండి రైతులను చిన్న చూపు చూస్తోందని,అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు మార్కెట్ కమిటీలను నియమించకపోవడమే రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ది అర్థమౌతుందన్నారు.కొద్ది రోజుల్లోనే రైతులు పండించే పంటలు చేతికి వస్తుందని ఇప్పటికైనా ఈ విషయంలో చొరవ తీసుకుని వెంటనే కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు.

## ఆత్మీయ సన్మాన సభను విజయవంతం చేయండి

**గజ్వేల్ టౌన్, సెప్టెంబర్ 25 (ప్రభాతవార్త):** సిద్దిపేట పట్టణంలోని టిఎన్‌జిఓ భవన్‌లో ఈనెల 26న నిర్వహించనున్న ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండ రాం ఆత్మీయ సన్మాన సభను విజయవంతం చేయాలని తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ గౌసొద్దీన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి మేధావులు, ఉద్యమకారులు పెద్దఎత్తున హాజరుకావాలని కోరారు.

## ఉపాధ్యాయులకు శిక్షణ శిబిరం

**సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 25,ప్రబాతవార్త :** ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులకు శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రాం ప్రతినిధి స్రవంతి అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో టెక్ మహీంద్రా ఫౌండేషన్, సహాయ ట్రస్ట్, సైన్స్ అకాడమీ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి ఉపాధ్యాయ శిక్షణ శిబిరాన్ని టెక్ మహేంద్రా ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ సుమన్‌తో కలిసి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు ప్రయో గాత్మకంగా బోధన సాగితే ఉన్నత స్థాయి వరకు వారిలో అన్ని అంశాలు సులభంగా నేర్చుకోగలుగుతాని.. ఆ ఉద్దేశంతనే శిక్షణ అందించడం జరుగు తుందన్నారు. సైన్స్ అకాడమీ ఈ హైదారాబాద్ ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు హైదారాబాద్‌లో మాత్రమే నిర్వహించే వారమని మొదటిసారిగా హైదారాబాద్ బయట సైన్స్ కార్యశాల నిర్వహిం చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంతో విద్యార్థులలో అసక్తికర బోధనకు ఉపయు క్తంగా ఉంటుందన్నారు. ఉపాధ్యాయుల అసక్తి మేరకు మరిన్ని కార్య క్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈసందర్భంగా ప్రోగ్రాం నిర్వాహకులు స్రవంతి, సుమన లను ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమం లో జిల్లా క్వాలిటీ కో-ఆర్డినేటర్ బేతి భాస్కర్, రిసోర్స్ పర్సన్ రేవతి, అమర్ పాల్గొన్నారు.

## విద్యుత్‌ఘాతానికి గురై వ్యక్తి మృతి

**అక్కన్నపేట, సెప్టెంబరు 25,ప్రభాతవార్త :** విద్యుత్‌ఘాతానికి గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన అక్కన్నపేట మండల పరిధిలోని గుడాటిపల్లి పరిధిలో మంగళవారం రాత్రి జరిగింది.వివరాల్లోకి వెళ్తే కొండాపూర్‌గట్ట తండాకు చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ గుగులోతు తిరుపతి(25) ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ చేసేందుకు వెళ్లి విద్యుత్‌షాక్‌తో మృతి చెందినట్లు తెలుస్తోంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జాలువాయితండాలో 11కెవి ట్రాన్స్‌ఫార్మర్‌లో రిపేర్ రావడంతో అసిస్టెంట్ లైన్మెన్ రాజేందర్ ఫోన్ చేసి అక్కడికి వెళ్లమని చెప్పగా అక్కడికి చేరుకున్న తిరుపతి అసిస్టెంట్ లైన్‌మెన్‌కు ఫోన్ చేశాడని,అసిస్టెంట్ లైన్‌మెన్ స్టేషన్ ఆపరేటర్‌కు ఫోన్‌లో కాన్ఫిరెన్స్ కాల్‌లో ఉండి ఆపరేటర్‌కు ఆ ఏరియా ఎల్‌సి ఇవ్వమని చెప్పగా ఆపరేటర్ మరో ఏరియాకు ఎస్‌సి ఇచ్చాడని, ఎలాగు విద్యుత్ నిలిపివేసి ఉంది అనుకున్న తిరుపతి ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కి విద్యుత్ వైర్లను పట్టుకోవడంతో అక్కడిక్కడే మృతి చెందినట్లు చెబుతున్నారు.అయితే విషయం తెలుసుకున్న హుస్నాబాద్ సీఐ కొండ్ర శ్రీనివాస్,అక్కన్నపేట ఎస్ఐ విజయ్‌భాస్కర్‌లు ఘటనా స్థలానికి చేరకుని మృతుని ఫోన్ స్వాదీనం చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.ఇదిలా ఉంటే మృతి చెందిన తిరుపతి కుటుంబ సభ్యులు వారి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది.అయితే సంబదిత అసిస్టెంట్ లైన్‌మెన్ రూ ఐదులక్షలు ఇస్తానని చెప్పినా వినకపోవడంతో ఉన్నతాధికారులు అతన్ని సస్పెండ్ చేసినట్లు అందిన సమాచారం మేరకు తెలిసింది.అతని సస్పెండ్ అనంతరం మృతుని దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఈ విషయంపై మృతుని తల్లి గుగులోతు కౌసల్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయ్‌భాస్కర్ తెలిపారు.

## చికిత్స పొందుతూ ఆటోడ్రైవర్ మృతి

**హత్నూర, సెప్టెంబరు 25,ప్రభాతవార్త:** చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందాడని హత్నూర ఎస్ఐ సుభాష్ తెలిపారు. హత్నూర మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన పటేల్ విఠల్‌గౌడ్ ఈనెల 17న ఆటో నడుపుతూ, దౌల్తాబాద్ నుండి మల్కాపూర్‌కు వస్తుండగా, వెనక వస్తున్న ఆర్టీసి బస్సు డ్రైవర్‌తో సైడ్ ఇచ్చే విషయంలో గొడవ జరిగిందని ఎస్ఐ తెలిపారు. బస్సుడ్రైవర్ 100నెంబర్‌కు కాల్‌చేయగా పోలీసు సిబ్బంది ఇద్దరు డ్రైవర్లను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించగా, ఆర్టీసి డ్రైవర్, పటేల్ విఠల్‌గౌడ్‌పై ఫిర్యాదు చేయడానికి సిద్దమవుతుండగా, తనపై పోలీసు కేసు నమోదు అవుతుందనే ఆందోళనతో డీజిల్ పోసుకొని నిప్పు అంటించుకోగా, పోలీసులు మంటలను ఆర్పి, చిక్సిత నిమిత్తం నర్సాపూర్ అసుపత్రికి తరలించారని ఎస్.ఐ.సుభాష్ తెలిపారు. మెరుగైన చికిత్స నిమిత్తం అదేరోజు కుటుంభీకులు గాంధీ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ పటేల్ విఠల్‌గౌడ్(29) బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడని ఎస్ఐ తెలిపారు. మృతుని తండ్రి వెంకటేశం గౌడ్ పిర్యాదు మేరకు కెసునమోదు చేసుకొని దార్యప్తు చేస్తూన్నామని ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య మౌనికి, ఇద్దరు పిల్లలు ఉన్నారని అన్నారు.

## జీవితంపై విరక్తితో యువకుడి ఆత్మహత్య

**శివ్వంపేట, సెప్టెంబర్ 25 (ప్రభాతవార్త) :** జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఆత్మహత్యచేసుకున్న సంఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై మహిపాల్‌రెడ్డి కథనం ప్రకారం శభాష్‌పలి గ్రామనికి చెందిన పడిగే బాబు(35) రెండు నెలల నుండి ఎలాంటి పనిచేయకుండా మద్యానికి బానిసై తరుచు ఇంట్లో గొడవపడుతు ఆర్థిక ఇబ్బందులతో ఈనెల 24 రాత్రి 8 గంటలకు ఇంట్లో నుంచి వెళ్లిపోయి గ్రామ శివారులోని పిలిగుండ్ల మత్తడి వాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహిపాల్ రెడ్డి తెలిపారు.


మాట్లాడుతున్న అందె అశోక్

## ఎస్సీ కార్పొరేషన్ నిధులు మంజూరు చేయాలి

**చేర్యాల, సెప్టెంబర్ 25,ప్రభాతవార్త :** దళిత కుటుంబాలకు ఎస్సీ కార్పొరేషన్ నిధులు మంజూరు చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం చేర్యాల పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో ఎస్సీ రైతులు,పేదలు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా దరఖాస్తు చేసుకుని ఎదురు చూస్తున్నారని రుణాలు రాకపోవడంతో ఆర్థికంగా వెనుకబడి ఉపాధిలేక దుర్భర జీవనం గడుపుతున్నారని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దళిత బంధు పేరుతో వారి పార్టీ నేతలకు రుణాలు ఇచ్చి నిరుపేద దళితులను నయా మోసం చేసిందన్నారు. ఇప్పటికైన కాంగ్రెస్ ప్రభుత్వం చొరవతీసుకుని ఎస్సీ కార్పొరేషన్ రుణాలను మంజూరు చేసి వారిని ఆదుకోవాలని కోరారు. సమావేశంలో ఈరి భూమయ్య, వలబోజు నర్సింహాచారి, ఏఐవైఎఫ్ జిల్లా నాయకుడు గూడెపు సుదర్శన్, స్వామి దాసు, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

**హుస్నాబాద్ రూరల్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త :** విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఈనెల 27న నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘం హుస్నాబాద్ పట్టణ కార్యదర్శి లక్ష్మణ్ నాయక్ పిలుపునిచ్చారు. బుధవారం ఈ కార్యక్రమానికి సంబందించిన వాల్ పోస్టర్‌ను పట్టణంలో ఆవిష్కరించారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడుస్తున్నా విద్యార్థులకు ఇవ్వాల్సిన స్కాలర్‌షిప్, రియంబర్స్‌మెంట్ విడుదల చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని, ఖాళీగా ఉన్న టీచర్ పోస్టుల భర్తీ,కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన నూతన విద్యా హక్కు చట్టాని కాంగ్రెస్ మద్దతు తెలపవద్దనే డిమాండ్‌లతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు తిరుపతినాయక్, నరేష్, అరుణ్, నవీన్ పాల్గొన్నారు.

## కిసాన్ సంఘ్ డివిజన్ ఇన్‌చార్జిగా వేణుగోపాల్‌రెడ్డి


కిసాన్ సంఘ్ సమావేశ దృశ్యం

**హుస్నాబాద్ టౌన్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త :** కిసాన్ సంఘ్ హుస్నాబాద్ డివిజన్ ఇంచార్జీగా హుస్నాబాద్ పట్టణానికి చెందిన కవ్వ వేణుగోపాల్‌రెడ్డిని నియమిస్తూ సంఘం మూడు రాష్ట్రాల ఇంచార్జీ రామ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి ప్రకటించారు. బుధవారం పట్టణంలో ఏర్పాటుచేసిన కిసాన్ సంఘ్ కార్యవర్గ సమావేశానికి వారు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ కిసాన్ సంఘ్‌లో ఎన్నో ఏండ్లుగా పని చేస్తూ రైతాంగ సమస్యలపై పోరాటాలు నిర్వహించిన వేణుగోపాల్‌రెడ్డి సేవలను గుర్తించిన సంఘం ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. నూతన ఇంచార్జీగా ఎన్నికైన వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానన్నారు. తనకు అవకాశం కల్పించిన జాతీయ,రాష్ట్ర,జిల్లాల నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### మహాలింగేశ్వర స్వామి దేవాలయ ముఖ ద్వారానికి విరాళం

**హుస్నాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త :** మండలంలోని పందిల్ల గ్రామంలో నిర్మిస్తున్న శ్రీమహాలింగేశ్వర స్వామి ఆలయ నిర్మాణంలో భాగంగా దేవాలయ గర్భగుడి తలుపులు ముఖద్వారం ఏర్పాటు చేసేందుకు అదే గ్రామానికి చెందిన తంగళ్ళపల్లి రేణుకదేవి మురళీ మోహన్(చింతగట్టు) దంపతులు రూ 1లక్ష 75 వేల రూపాయలు విరాళంగా అందించినట్లు ఆ గ్రామ తాజామాజీ సర్పంచ్ తోడేటి రమేష్ తెలిపారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ఆలయ నిర్మాణం విషయంలో తమ సహకారం అందిస్తామని గతంలో మాట ఇచ్చి,ఇచ్చిన మాట మేరకు మొత్తం రూపాయలను కాంట్రాక్టర్‌కు బుధవారం అందజేయడం జరిగిందన్నారు. దేవాలయ నిర్మాణానికి విరాళాలు ఇవ్వాలనుకునే దాతలు ముందుకు వచ్చి సహకరించాలని కోరారు. ఆలయ నిర్మాణంలో గర్భగుడి ముఖద్వారానికి సహకరించిన దంపతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## నూతన ఎంఈఓకు సన్మానం


ఎంఈఓ మాధవరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

**జగదేవ్‌పూర్, సెప్టెంబర్ 25 (ప్రభాతవార్త):** ఎంఇవోగా బాధ్యతలు స్వీకరించిన మాధవరెడ్డిని బుధవారం ఎస్‌జిటి యూనియన్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జిటి యూనియన్ మండల అధ్యక్షుడు అంకం వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి బి.రాజేందర్, మండల బాధ్యులు మురళి తదితరులు పాల్గొన్నారు.

## ఇండియన్ బ్యాంకు ఎదుట రైతుల ధర్నా

### సంఘీభావం తెలిపిన బిజెపి నాయకులు

**బెజ్జంకి, సెప్టెంబర్ 25, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం అమలు పరిచిన రుణమాఫీ పథకంలో భాగంగా రెండు లక్ష వరకు రుణాలను మాఫీ చేస్తామని గడిచిన ఎన్నికల్లో హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తమను పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని తోటపల్లి ఇంటియన్ బ్యాంకు శాఖ పరిధిలోని సుమారు 800 రైతులకు రుణమాఫీ జరగలేదని బ్యాంకు చుట్టుపక్కనగల గ్రామాల రైతులు బుధవారం బ్యాంకుకు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. కాగా నిరసన చేపట్టిన రైతులకు బిజెపి నాయకులు మాజీ మంత్రి ఇనుగల పెద్దిరెడ్డి సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. 2 లక్షల రుణాలు ఉన్నఅర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలన్నారు. రుణా మాఫీ చేయడంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేసిన రాబోయే రోజుల్లో ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు కొలిపాక రాజు, ప్రధాన కార్యదర్శి బోయినపల్లి అనిల్‌రావు, యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షులు బోయినిపల్లి వరుణ్‌రావు, రైతులు పాల్గొన్నారు.


రైతులకు సంఘీభావం ప్రకటిస్తున్న బిజెపి నేత మాజీ మంత్రి పెద్దిరెడ్డి

## పరిసరాల శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

**హుస్నాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త**

పరిసరాల శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న అన్నారు. బుధవారం స్వచ్ఛతహి సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 15వ వార్డులో ఇంటింటికి తిరిగి తడి,పొడి చెత్తబుట్టలను పంపిణీ చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ప్రజలు తీసుకున్న చెత్త బుట్టలలో నీలి కలర్ డబ్బాలో పొడి చెత్తను గ్రీన్ ఆకుపచ్చ డబ్బాలో తడి చెత్తను వేయాలని సూచించారు. ఇంట్లో వేరుచేసిన చెత్తను ఆరుబయట పడవేయకుండా మున్సిపల్ వాహనాలకు చెత్తను అందించాలని సూచించారు. అంతే కాకుండా పట్టణ ప్రజలందరూ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేదించాలని వాటి స్థానంలో బట్ట సంచులు,టిఫిన్ బాక్సులు వాడాలన్నారు.


చెత్త బుట్టలు పంచి ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత వెంకన్న తదితరులు

**2వ వార్డులో...**

పట్టణంలోని రెండవ వార్డులో వార్డు కౌన్సిలర్ బోజు రమాదేవి రవీందర్ ఆధ్వర్యంలో ఇంటింటికి చెత్తబుట్టల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. పంపిణీ చేసిన బుట్టలలో తడి,పొడి చెత్తలను ప్రజలు ఇంట్లోనే వేరుచేసుకోవాలని వేరుచేసిన చెత్తను మున్సిపల్‌వాహనాలకుఅందిస్తే వాహనాల తరలించిన చెత్తతో కంపోస్టు ఎరువుల లాంటి తయారు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ రవికుమార్, వన మహోత్సవ్ సూపర్‌వైజర్ జాలిగం శంకర్, ఆర్‌పి శ్రీలత, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

**20వ వార్డులో...**

స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 20వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న ఆదేశాల మేరకు కౌన్సిలర్ వాల సుప్రజనవీన్‌రావు వార్డులోని ఇంటింటికి తిరుగుతూ చెత్త బుట్టలను పంపిణీ చేశారు. ఇచ్చిన చెత్త బుట్టలలో ప్రజలు ఇంట్లోనే తడి పొడి చెత్తను వేరు చేయాలని వివరించారు.

వేరు చేసిన చెత్తను మున్సిపల్ సిబ్బంది ఒదిస్తే చెత్త ద్వార ఎరువులు తయారు చేయడం జరుగుతుందని సూచించారు. వీలయినవారు ఇండ్లలోనే చెత్తద్వార కంపోస్టు ఎరు వును తయారు చేసుకుని ఇంట్లో ఉండే మొక్కలకు వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ మమత తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## విద్యా భారతి హైస్కూల్‌లో వైజ్ఞానిక ప్రదర్శన

**రామచంద్రాపురం, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** భారతీ నగర్ డివిజన్ పరిధిలోని విద్యా భారతి హైస్కూల్‌లో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమంలో కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యక్షులు దామోదరరెడ్డి మాట్లాడుతూ సరస్వతీ విద్యాపీఠ హైద్రాబాద్‌చే మూడురోజులపాటు వైజ్ఞానిక ప్రదర్శలు ఉంటాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగాఉన్న విద్యాపీఠం పాఠశాలల నుంచి 500 మంది విద్యార్థులు ప్రదర్శనలో పాల్గొంటారన్నారు. ప్రదర్శనలో 100కు పైగా ఎగ్జిబిషన్‌లను ప్రదర్శిస్తారన్నారు. ఈ సందర్బంగా కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో సైన్స్ పట్ల అభిలాషను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శలు ఉపయోగపడతాయన్నారు.

## ఘనంగా ఫార్మాసిస్ట్ వేడుక

**హుస్నాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త :** ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం రోజున పట్టణంలోని వినాయక మెడికల్ హాల్‌లో వేడుకలను పట్టణ కెమిస్ట్, డ్రగ్గిస్ట్ వెల్ఫేర్ అసోసియోషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా ఫార్మసీ రంగంలో సభ్యులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఫార్మసీ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఫార్మాసిస్టులు నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. అనంతరం సభ్యులందరిని అసోసియోషన్ గౌరవ అధ్యక్షులు సభ్యులందరినీ శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియోషన్ గౌరవ అధ్యక్షులు దాసరి వినోద్, కనుకుంట్ల శ్రీనివాస్, రంజిత్, వెంకటరమణ, సంధ్య, మహేష్, దినేష్, శ్రీకాంత్, రామకృష్ణ, భరద్వాజ్, కనుకుంట్ల శశికిరణ్, నూక వంశీ పాల్గొన్నారు.

## గ్యాస్ ఏజెన్సీ గోదాంను తనిఖీ చేసిన తహసీల్దార్


గ్యాస్ ఏజెన్సీ గోదాంలో తనిఖీ చేస్తున్న తహసీల్దార్ కృష్ణ

**వెల్దుర్తి, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ఎస్‌వీఆర్ గ్యాస్ ఏజెన్సీ గోదాంలో అక్రమాలు జరుగుతున్నాయని, ప్రజలకు చేరాల్సిన గ్యాస్ సిలిండర్‌లో 2-3 కిలోల చొప్పున గ్యాస్ తక్కువగా వస్తుందని దామరంచ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్బంగా బుధవారం స్థానిక తహశీల్దార్ కృష్ణ, ఆర్ఐ జయభారత్ రెడ్డిలు స్థానిక ఎస్‌వీఆర్ గ్యాస్ ఏజెన్సీ గోదాంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ గ్యాస్ ఏజెన్సీలో తనిఖీలు నిర్వహిస్తున్నామని, తనిఖీలో అవకతవకలకు పాల్పడ్డట్లు నిర్ధారణ జరిగితే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఈ విషయమై జిల్లా సివిల్ సప్లై అధికారులకు సమాచారం ఇవ్వడం జరిగిందన్నారు. పై అధికారులు సైతం విచారణ చేపట్టిన అనంతరం వారిపై చర్యలు తీసుకుంటారన్నారు. పేద ప్రజలకు అందవలసిన గ్యాస్ సిలిండ్లను అక్రమంగా అమ్ముకుంటున్న ఏజెన్సీలను రద్దు చేయాలని గ్రామస్థులు కోరారు. నిండు గ్యాస్ సిలిండర్ నుంచి ఖాళీగా ఉన్న సిలిండర్‌లోని గ్యాస్‌ను ఫిల్లింగ్ చేస్తూ గతంలో చిన్నశంకరంపేట మండలం దర్‌పల్లి వద్ద గ్రామస్థులకు దొరికిన సంఘటన మరవకముందే మంగళవారం దామరంచ గ్రామంలో ఇటువంటి సంఘటన వెలుగుచూసింది. ఇప్పటికైనా అధికారులు గ్యాస్ ఏజెన్సీ పై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## ఎంఇవోను సన్మానించిన పిఆర్‌టియు నేతలు

**కొల్చారం, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని మండల వనరుల కేంద్రంలో బుధవారం నూతన మండల విద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణరావును మండల పీఆర్టీయూ యూనియన్ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షులు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కరుణాకర్, జిల్లా మాజీ అధ్యక్షులు సత్యనారాయణరెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు యాదగిరి, శశాంక్, ఏగొండ, పాసం వెంకటేశం, పీఆర్టీయూ సభ్యులు శ్రీరామ్, కృష్ణ, ప్రవీణ్, వెంకటనర్సింలు, వీరు కుమార్, చంద్రకాంత్, ఏగొండ, యాదవరెడ్డి, కదవేగురు నారాయణ, ఉపాధ్యాయ బృందం తదితరులు ఉన్నారు.


ఎంఇవో సత్యనారాయణరావును సన్మానిస్తున్న పీఆర్టీయూ నాయకులు


పండిట్ దీన్‌దయాళ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బిజెపి నాయకులు

## పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు ఘన నివాళులు

**గజ్వేల్, సెప్టెంబర్ 25 (ప్రభాతవార్త):** సమాజంలో అట్టడుగున ఉన్న వ్యక్తులకే ప్రభుత్వ పథకాలు అందేలా చేయాలన్న అంత్యోదయ భావనను రూపొందించి ప్రపంచంలో అతిపెద్ద పార్టీగా అవతరించిన బిజెపికి పటిష్ట పునాదులు వేసిన పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతిని బుధవారం గజ్వేల్ పట్టణంలోని బిజెపి కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి మర్కంటి ఏగొండ, గజ్వేల్ పట్టణ బిజెపి ఉపాధ్యక్షుడు నాయిని సందీప్, మాద్దురి నర్సింహా, చెప్యాల వెంకట్‌రెడ్డి, వేణుగోపాల్, రాజు పాల్గొన్నారు.

**జోగిపేటలో...**


దీన్‌దయాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బిజెపి నాయకులు

**జోగిపేట, సెప్టెంబర్ 25, ప్రభాతవార్త:** బిజెపి ఆధ్వర్యంలో పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ్ జయంతిని ఘణంగా నిర్వహించారు. జోగిపేటలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘణంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ్ చేసిన కృషిని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు ప్రభాకర్‌గౌడ్, నాయులుల ఉల్వాల వెంకటేశం, జగన్నాథం, నర్సింలు, ఖలీల్, శ్రీరామ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

**అమీన్‌పూర్‌లో...**


దీన్ దయాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

**అమీన్‌పూర్, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త:** పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ సేవలు చిరస్మరణీయమని బీజేపీ మండల అధ్యక్షులు ఈర్ల రాజు అన్నారు. బుధవారం పండిట్ దీన్ దయాల్ జయంతిని పురస్కరించుకొని అమీన్‌పూర్ బీజేపీ కార్యాలయంలో వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు, మండల కార్యవర్గ సభ్యులు, శక్తి కేంద్రాల ఇన్‌ఛార్జిలు, వివిధ మోర్చాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు కల్పించాలి

**వెల్దుర్తి, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాయలంలో బుధవారం వీఆర్ఏల మండల ఉపాధ్యక్షులు రమేష్ ఆధ్వర్యంలో 61 సంవత్సరాల పైబడిన వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు కల్పించాలని వివిధ డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ కృష్ణకు అందజేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని, అందులో భాగంగా వారికి ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రమేష్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.


తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

# ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి

**గజ్వేల్, సెప్టెంబర్ 25 (ప్రభాతవార్త):**

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడుస్తున్నా ఎన్నికలముందు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి నెరవేర్చలేదని బిఆర్ఎస్ నాయకులు కళ్యాణ్‌కార్ నర్సింగరావు ఆరోపించారు. బుధవారం గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ పేరుతో డబ్బులతో పాటు తులంబంగారం ఇస్తానన్న రేవంత్‌రెడ్డి ఇంత వరకు నిధులు విడుదల చేయలేదన్నారు. ఏడాది కావస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రధాత, మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ఎంతో ప్రతిష్టాత్మకంగా దళిత గిరిజన బడుగు బలహీన వర్గాలకు చెందిన ఆడపిల్లల కోసం కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ పథకాన్ని తీసుకువస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మేము కూడా పథకాన్ని కొనసాగిస్తామని చెప్పి ఇంత వరకు కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ నిధులు మంజూరు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. ఆడపిల్లల తల్లిదండ్రులు కళ్యాణ లక్ష్మి, షాదిముబారక్ చెక్కుల కోసం తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరిపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. ఆడపడుచుల కన్నీళ్లు తుడవాలనే సోయి ఉంటే కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం డబ్బులతో పాటు తులం బంగారం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఆర్‌కె.శ్రీను, చింత శ్రీను, అజీజ్, బాకి స్వామి, ఎండి.కరీం, మామిడి రాములు, షరీఫ్, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కళ్యాణ్‌కార్ నర్సింగరావు

## తెలుగు వర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరునే కొనసాగించాలి

### -ఆర్యవైశ్య మహాసభ నేతల డిమాండ్

**వర్గల్, సెప్టెంబర్ 25 (ప్రభాతవార్త):** తెలుగు యూనివర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరునే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సిద్దిపేటలో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి వర్గల్, ములుగు, మర్కుక్ మండలాల నుండి ఆర్యవైశ్య సంఘం బాధ్యులు పెద్దఎత్తున తరలివెళ్ళారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధి జూలూరి రంగయ్యగుప్త, ఆయా మండలాల అధ్యక్ష, కార్యదర్శులు వెంకయ్య, దోసపాటి గోపాల్, బిక్షపతి, శ్రీనివాస్, శివ, సుధాకర్, రమేష్, లక్ష్మినర్సయ్య తదితరులు మాట్లాడుతూ రాష్ట్రం కోసం ప్రాణాలు అర్పించిన పొట్టిశ్రీరాములు పేరును మార్చి తమ మనోభావాలను దెబ్బతీయవద్దన్నారు. కొన్ని దశాబ్దాలుగా పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించి ప్రస్తుతం ఆ పేరును తొలగించాలని చూస్తుండడం భావ్యంగా లేదని, ప్రభుత్వం స్పందించి నిర్ణయాన్ని ఉపసంహరించుకోని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కాగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సిద్దిపేట కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి మంత్రి కొండా సురేఖ, కలెక్టర్లకు ఆయా మండలాల ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు.

## బస్సులు సమయానికి రావాలి..విద్యార్థుల రాస్తారోకో


ఖాజాపూర్‌లో రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 25, ప్రభాతవార్త:** సమయానికి బస్సులు రాకపోవడంతో పాఠశాలకు, కళాశాలలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఖాజాపూర్ గ్రామ విద్యార్థులు ఆరోపించారు. చిన్నశంకరంపేట మండలం ఖాజాపూర్,ఖాజాపూర్ తండాల విద్యార్థులు చదువుకోవడానికి అక్కన్నపేట,రామాయంపేటలోని పాఠశాలలకు, కళాశాలకు వెళ్తుంటారు. బస్సు ఉదయం, సాయంత్రం రెండు సార్లు పాఠశాలలకు, కళాశాలలకు సమయానికి వస్తుండేవి. వారంరోజులుగా బస్సు సమయానికి రాకపోవడంతో సమయానికి బడికి చేరుకోలేకపోతున్నామని విద్యార్థులు వాపోయారు. పలు సార్లు అధికారులకు చెప్పినప్పటికి వారు పట్టించుకోలేదని ఆరోపించారు. బుధవారం కూడ బస్సు సమయానికి రాకపోవడంతో గవ్వలపల్లి-రామాయంపేట ప్రధాన రహదారి ఖాజాపూర్ చౌరస్తాలో విద్యార్థులు రస్తారోకో చేపట్టారు. ఆర్టీసి అధికారులు కచ్చితమైన హామిని అందించేంత వరకు రస్తారోకో విరమించేది లేదని బిష్మించుకు కూర్చోన్నారు. స్థానిక నాయకులు ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ దృష్టికి తీసుకెళ్లగా ఆర్టీసీ అధికారులతో మాట్లాడి సమయానికి బస్సులు వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామి ఇవ్వడంతో వారు రస్తారోకో విరమించారు.

## జీవో వల్ల పనిభారం... ఉపాధ్యాయుల నిరసన

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 25,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జీవో వల్ల ఉపాధ్యాయులకు పనిభారం పెరిగిందని వివిధ ఉపాధ్యాయ సంఘం నాయకులు తెలిపారు. బుధవారం చిన్నశంకరంపేటలోని ఆదర్శ పాఠశాలలో భోజన విరామ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 25ను ఉపసంహరించాలంటూ నిరసన వ్యక్తం చేశారు. 11-60 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులుంటే విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం పడుతుందన్నారు. ప్రభుత్వం తెచ్చిన జీవోను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. జీవో వల్ల ఉపాధ్యాయులపై తీవ్ర పనిభారం పెరిగి, విద్యార్థులకు పాఠాలను బోధించలేమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు శివప్రసాద్, సత్యనారాయణ, సతీష్, శ్రీనివాస్, రామబ్రహ్మం, మహేదర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు : డిపివో

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 25,ప్రభాతవార్త:** ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని డీపీవో యాదయ్య తెలిపారు. బుధవారం మండల పరిధి కామారం, మిర్జాపల్లి గ్రామాలలో పర్యటించి పారిశుధ్య కార్మికులకు భద్రత కిట్లను అందించారు. అంతకు ముందు ఎంపీడీవో కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మురుగు కాలువలను శుభ్రం చేయించి, దోమల మందును పిచికారి చేయించాలని అధికారులకు సూచించారు. కామారంలో ఇంటింటికి వెళ్లి నిల్వ ఉన్న నీటిని పరిశీలించారు. కార్మికులు ఎప్పటికప్పుడు గ్రామాలోని చెత్తను తొలగిస్తూ శుభ్రంగా ఉంచుతున్నారని వారిని అభినందించారు. వారికి వైద్య పరీక్షలను చేయించారు. పారిశుద్దం లోపించకుండా చూడాలని పంచాయతీ కార్యర్శులకు సూచించారు. నిటి సరఫరాలో అంతరాయం ఉంటే ముందురోజే గ్రామస్తులకు సమాచారం అందించాలని తెలిపారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని పెట్టాలన్నారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. ఓటరు జాబితా, వార్డుల జాబితాలవారిగా గ్రామాలలో అందుబాటులో ఉన్నాయని, ఎమైన తప్పులుంటే సరిచేయించుకోవాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో దామోదర్,ఎంపీవో గిరిజారాణి, పంచాయతీ కార్యదర్శి సుహాసినిలు పాల్గొన్నారు.

## రేషనలైజేషన్ జీవోను వెంటనే ఉపసంహరించాలి

### -టిపిటిఎఫ్ మండల అధ్యక్షుడ తాళ్ల నాగరాజు

**గజ్వేల్, సెప్టెంబర్ 25 (ప్రభాతవార్త):** టీచర్ల రేషనలైజేషన్ జీవోను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని టిపిటిఎఫ్ మండల అధ్యక్షుడు తాళ్ల నాగరాజు డిమాండ్ చేశారు. బుధవారం టిపిటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల ఉపాధ్యాయుల సర్దుబాటుకు సంబంధించి రేషనలైజేషన్ జీవో 25ను విడుదల చేసిందని, ఈజీవో పూర్తిగా అశాస్త్రీయమైనదని, 60 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు, 90 మంది విద్యార్థులకు ముగ్గురు ఉపాధ్యాయులు ఉండాలన్నదే ఈ జీవో సారాంశమని, ఇలా చేయడం వల్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను మూసివేసి ప్రైవేట్‌పరం చేయడంలో ప్రభుత్వం కుట్రఉందన్నారు. ఇద్దరు ఉపాధ్యాయుల తో పాఠశాలలను నిర్వహించడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎలా వస్తుందని ప్రభుత్వం ఆలోచించాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్‌జిటిలకు ఓటు హక్కు కల్పించాలని, అలాగే 317 జీవో బాధితులకు వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. టిఆర్‌టి ద్వారా కొత్త టీచర్లను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టిపిటిఎఫ్ సీనియర్ నాయకులు బి.రాజులు, పంబాల ఎల్లయ్య, పాపగారి పాపిరెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, దమ్మని మల్లయ్య, పురాణం శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, మంద శ్రీనివాస్, వేణు, వి.శ్రీనివాస్, మోహన్‌రావు, పెంటయ్య, రాంరెడ్డి, రమేష్, మహేందర్‌రెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిష్టాత్మకంగా బిజెపి సభ్యత్వ నమోదు

### పార్టీ మండల అధ్యక్షుడుబాల్‌రెడ్డి

**వర్గల్, సెప్టెంబర్ 25 (ప్రభాతవార్త):** మండలంలో బిజెపి సభ్యత్వ నమోదును ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు టేకులపల్లి బాల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మీనాజిపేట, అనంతగిరిపల్లి, నాచారం, మజీద్‌పల్లి గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే గజ్వేల్ నియోజకవర్గాన్ని ముందు ఉంచాలనే లక్ష్యంతో విస్తృతంగా సభ్యత్వ నమోదు చేపడుతున్నట్లు స్పష్టంచేశారు. యువత, మహిళలు, రైతులు, చిరు వ్యాపారులు, నిరుద్యోగుల నుండి మంచి స్పందన వస్తుందని తెలిపారు. ముఖ్యంగా కేంద్రంలో ప్రధాని నరేంద్రమోడి చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో పెద్దఎత్తున చేరుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పంపరి రమేష్, తిరుపతిరెడ్డి, కుమ్మరి రమేష్, కాయిత రాజు, ద్యాగ శ్రీకాంత్‌తో పాటు ఆయా గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

## కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు

**కొండపాక, సెప్టెంబర్ 25, ప్రభాతవార్త :** స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రమైన కుకునూరుపల్లిలో గ్రామ పంచాయతీ సిబ్బందికి సబ్బులు, సర్ఫు, కొబ్బరి నూనె ఎంపిఓ విష్ణు గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి స్వప్నతో కలిసి అందించారు. అనంతరం పిహెచ్‌సిలో సిబ్బందికి వైద్య పరీక్షలు చేయించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే గ్రామ ప్రజలంత ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ప్రభుత్వం సూచించిన విధంగా పంచాయతీ కార్మికులకు వైద్య పరీక్షలు చేయించడం జరుగుతుందన్నారు. అందరు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం బాగుంటుందన్నారు. కార్యక్రమంలో కారోబార్ శ్రీధర్, సిసి లింగం, వైద్యురాలు పర్వీన్, ఎంఎల్‌హెచ్‌పి భూలక్ష్మి, ఫార్మసిస్ట్ సౌమిత, మాజీ వార్డు సభ్యులు కనకయ్య తదితరులు పాల్గొన్నారు.


బదిలీ అయిన ఏఓ శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న రైతులు

ఏఓ శ్రీనివాస్‌రెడ్డి సేవలు అమోఘం : ఎడిఎ

**మనూర్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రెడ్డి సేవలు అమోఘమని ఏడిఏ నూతన్‌కుమార్ అన్నారు. మనూర్ లోని రైతువేదికలో బదిలీ అయిన ఏఓ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈఓలు ప్రవీణ్ కుమార్, మహేష్‌లకు ఆత్మీయ వీడ్కోలు సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడిఏ నూతన్‌కుమార్ మాట్లాడుతూ విధి నిర్వాహణ అంకితభావంతో కొనసాగితే కలకాలం ప్రజల గుండెల్లో కొలువుంటామన్నారు. ఏఓ, ఏఈఓలను ఏడిఏ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఈఓ మహేష్ చౌహాన్, ఏఈఓలు సంగమేశ్వర్, ప్రవీణ్‌కుమార్, నాయకులు సిద్దారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఫర్టిలైజర్ డీలర్లు శ్రీనివాస్, శంకర్, మారుతి, సురేష్, రవీందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## ఎంఈఓ ధనుంజయగౌడ్‌ను సన్మానించిన ఉపాధ్యాయులు


ఎంఈఓ ధనుంజయగౌడ్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

**అల్లాదుర్గం, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** మండల విద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించిన ధనుంజయగౌడ్‌ను ఉపాధ్యాయులు బుధవారం ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. అల్లాదుర్గంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహించిన ధనుంజయగౌడ్‌ను మండల విద్యాధికారిగా ప్రభుత్వం బాధ్యతలు అప్పగించడంతో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పిచ్చయ్య, రాజేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రావు, అర్జున్, కృష్ణ, స్వప్న, వీరప్ప, వేణు, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఎంఈఓ కృష్ణారెడ్డిని...**


ఎంఈఓ కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

**చౌటకూరు, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న జి కృష్ణారెడ్డికి మండల విద్యాశాఖ అధికారిగా ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. బుధవారం కృష్ణారెడ్డి ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించడంతో చౌటకూరు పాఠశాల ఉపాధ్యాయులు విజయలక్ష్మి పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలుగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ, ఇంచార్జి ప్రధానోపాధ్యాయులను ఉపాధ్యాయులు రమాదేవి, భాస్కర్, మోహన్‌రెడ్డిలు ఘనంగా సన్మానించారు.

## వారసులకు ఉద్యోగాలు కల్పించాలి


తహసీల్దార్‌కు వినతి పత్రం అందచేస్తున్న విఆర్ఏల వారసులు

**ఝరాసంగం, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** 61 సంవత్సరాల వయసు పైబడిన విఆర్ఏ వారసులకు ఉద్యోగాలు కల్పించాలని గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జిఓ జారీచేసినా నేటివరకు కల్పించకపోవడం విడ్డూరంగా ఉందని విఆర్ఏల వారసులు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం ఝరాసంగంలోని రెవెన్యూ కార్యాలయంలో విఆర్ఏల వారసులు తహసీల్దార్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా విఆర్ఏల వారసులు మాట్లాడుతూ 2023 జులై 24న జారీ చేసిన జిఓఎంఎస్ నంబర్ 81, 85 ప్రకారం 61సంవత్సరాల వయసు పైబడిన విఆర్ఏల వారసులకు నియామకం ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విఆర్ఏల వారసులు పాల్గొన్నారు.

## పెద్దశంకరంపేట మండల విద్యాధికారిగా వెంకటేశం

**పెద్దశంకరంపేట, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త:** మండల విద్యాధికారిగా డి.వెంకటేశం నియమితులయ్యారు. బుధవారం స్థానిక ఎంఆర్‌సీలో మండల విద్యాధికారిగా వెంకటేశం బాధ్యతలు స్వీకరించారు. పెద్దశంకరంపేటలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల నోడల్ అధికారిగా విధులు నిర్వహించడంతో పాటు ప్రస్తుతం మండల విద్యాధికారిగా నియమితులయ్యారు.

## ఎండోమెంట్ వ్యవస్థను రద్దు చేయాలి

**-హిందూ ఆలయాల పరిరక్షణ సమితి బాధ్యులు**

**మనూర్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** ఎండోమెంట్ వ్యవస్థను రద్దు చేసి ఆలయ నిర్వాహణ బాధ్యతలను సాధుసంతులకు, సనాతన ధర్మ పరిరక్షకులకు అప్పగించాలని హిందూ ఆలయాల పరిరక్షణ సమితి బాధ్యులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రమైన మనూర్‌లోని రెవిన్యూ కార్యాలయంలో హిందూ ఆలయాల పరిరక్షణ సమితి బాధ్యులు అధికారులకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూ ఆలయాల్లో విధులు నిర్వహిస్తున్న అన్యమతస్థులను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. నూతన ఉద్యోగాల భర్తీలో అన్యమతస్తులకు అవకశం ఇవ్వకూడదన్నారు. హిందూ ఆలయాల ఆదాయాన్ని హిందూ ధార్మిక కార్యక్రమాలకు మాత్రమే వినియోగించాలని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు వాడవద్దన్నారు. దేవాదాయ శాఖ భూములను హిందువులకు మాత్రమే కౌలుకు ఇవ్వాలన్నారు. గో హత్యపై చట్టాన్ని కఠినంగా అమలు చేయాలన్నారు. తిరుమల తిరుపతి లడ్డును అపవిత్రం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దేవాలయ పరిరక్షణ సమితి బాధ్యులు సాయిరాం, ఈశ్వరప్ప, రాజగిరి శ్రీనివాస్, చాకలి అశోక్, రాజు పాటిల్, దూదికొండ నరేష్‌రెడ్డి, గణేష్, దోవూర్ జైపాల్, గాజజుల ప్రశాంత్, మల్లయ్యస్వామి, దత్తురెడ్డి, జైపాల్‌రెడ్డి, నాగేష్, బీరప్ప, బీర్‌గొండ తదితరులు పాల్గొన్నారు.


రెవున్యూ కార్యాలయంలో వినతి పత్రం అందచేస్తున్న నేతలు


పుల్‌కల్‌లో దీన్‌దయాల్‌కు నివాళులర్పిస్తున్న బిఆర్ఎస్ నేతలు


మనూర్‌లో పండిత్ దీన్ దయాల్ జయంతి వేడుకల దృశ్యం


జహీరాబాద్‌లో దీన్‌దయాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బిజెపి నేతలు

# ఘనంగా పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి

**పుల్‌కల్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో బుధవారం పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పండిత్ దీన్ దయాల్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షుడు కుమ్మరి పండరి మాట్లాడుతూ జాతి పునర్ నిర్మాణానికి దీన్‌దయాల్ చేసిన కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో యువ మోర్చా అధ్యక్షుడు మహేందర్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు శ్రీశైలం, ఓబిసి మోర్చా అధ్యక్షుడు నర్సింలు, నాయకులు మహేష్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

**మనూర్‌లో...**

**మనూర్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో బుధవారం పండిత్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ 108వ జయంతి వేడుకలు బిజెపి మండల అధ్యక్షుడు కరణం ఈశ్వరప్ప ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దీన్‌దయాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి చాకలి అశోక్, రాజుపాటిల్, మండల ఉపాధ్యక్షుడు మల్లయ్యస్వామి, మైకోడ్ బీరుగొండ, నారాయణఖేడ్ రామ్ మందిర్ మాజీ డైరెక్టర్ రాజగిరి, శ్రీనివాస్, బెల్లాపురం, బీరప్ప, దూది గొండ నరేష్‌రెడ్డి, దోవూరు జైపాల్, నగేష్, గాజుల ప్రశాంత్, దత్తురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**అల్లాదుర్గంలో...**

**అల్లాదుర్గం, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** పండిత్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను బుధవారం అల్లాదుర్గంలో బిజెపి కార్యాలయంలో ఘనంగా జరపుకున్నారు. బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన దీన్ దయాల్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు రాములు మాట్లాడుతూ పండిత్ దీన్‌దయాల్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీచేశారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు కాల రాములు, మండల ప్రధాన కార్యదర్శి సాయిలుగౌడ్, నాయకులు కె.బ్రహ్మం, పరిపూర్ణం, శ్రీనివాస్, సదానందం, మారుతి, వసంత, శ్రీకాంత్, సాయికుమార్, ఆంజనేయులు, అనిల్, సురేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**జహీరాబాద్‌లో...**

**జహీరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** పండిత్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని బిజెపి కార్యాలయంలో బిజెపి పట్టణ అధ్యక్షుడు మఠం విశ్వనాథ్ స్వామి ఆధ్వర్యంలో దీన్‌దయాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జహీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ నౌబాద్ జగన్నాథ్ మాట్లాడుతూ దీన్ దయాల్ సమాజం అభ్యున్నతికి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌గుప్తా, గొల్ల భాస్కర్, ప్రశాంత్‌పాటిల్, విశ్వనాథ్‌యాదవ్, శివరాజ్, మంజుల కౌలాస్, టూకురి వెంకట్, రాజు, నరసింహ పాల్గొన్నారు.


అల్లాదుర్గంలో దీన్ దయాల్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం


మెదక్‌లో దీన్ దయాల్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

**పెద్దశంకరంపేటలో...**

**పెద్దశంకరంపేట, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త:** పట్టణంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో పండట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షుడు కోణం విఠల్ మాట్లాడుతూ దేశానికి పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి శ్రావణ్ కుమార్, టెంకటీ మాజీ సర్పంచి సుధాకర్, నాయకులు బుగుడాల కృష్ణ, సుభాష్, మంగలి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**మెదక్‌లో...**

**మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్25 ప్రభాతవార్త:** జన సంఘ్ వ్యవస్థాపకులు, దేశం కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు, ఏకాత్మత మానవవాదం ప్రవచించి పేదల పక్షాన నిలబడిన మహోన్నత వ్యక్తి పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ అని బీజేపీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ అన్నారు. బుధవారం పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు నాయిని ప్రసాద్, విఠలేష్, సంగీత, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.


ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో బహుమతులు అందుకున్న విద్యార్థులు

## ఎస్‌జిఎఫ్ క్రీడల్లో రాణించిన విద్యార్థులు

**-అండర్ 14లో జిల్లా స్థాయి ప్రథమ బహుమతి**

**చౌటకూరు, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడల్లో మండలంలోని బొమ్మారెడ్డిగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటి ప్రథమ స్థానాన్ని కైవశం చేసుకున్నారు. పటాన్‌చెరులో నిర్వహించిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కబడ్డీ పోటీల్లో గిరిజన ఆశ్రమ పాఠశాల అండర్ 14 విభాగంలో బాలురు పోటీపడి ప్రతిభ చాటారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడం పట్ల వార్డెన్ ఎస్ శోభ విద్యార్థులకు అభినందించారు. విద్యార్థులకు బహుమతులు అందచేశారు.

## ఘనంగా ప్రపంచ ఫార్మాసిస్ట్ దినోత్సవం

**మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త:** వైద్యుల తరువాత ఫార్మాసిస్టల బాధ్యత గొప్పదని తెలంగాణ రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ సభ్యులు, జిల్లా అధ్యక్షులు టి.రాజు అన్నారు. బుధవారం ప్రపంచ ఫార్మాసిస్ట్ దినోత్సవం సందర్భంగా ఛాంబర్ ఆఫ్ ఫార్మాసిస్ట్ అసోసియేషన్ వారి పిలుపే మేరకు మెదక్ జిల్లా నలుమూలల నుండి ఫార్మాసిస్టులు మెదక్ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. తమ ఐక్యతను చాటారు. మెదక్ పట్టణంలోని బస్ డిపో నుంచి రాందాస్ చౌరస్తా వద్దకు ర్యాలీగా వెళ్లి ఫార్మాసిస్ట్ ప్రాధాన్యతను తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి తెలంగాణ రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ సభ్యులు, జిల్లా అధ్యక్షులు టి. రాజు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఫార్మాసిస్టులు ఐక్యం కావాలని, ఏ రకమైన అవసరమున్నా తాను దగ్గరుండి స్వల్ప సమయంలోనే వారి సమస్యలను తీరుస్తానని తెలిపారు. ఫార్మాసిస్టల విధివిధానాలను తెలియజేశారు. వారు సమాజంలో గొప్ప సేవలను అందిస్తూ సమాజానికి ఎంతో తోడ్పడుతున్నారని, రోగాలను నయం చేయడంలో డాక్టర్ తరువాత స్థానంలో ఉండి తనదైన పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సంగమేష్, మెదక్ ఏరియా అధ్యక్షులు రాగం శ్రీనివాస్, కార్యదర్శి శేషాచారి, కోశాధికారి రాధాకిషన్, ఫార్మాసిస్ట్ కోఆర్డినేటర్ జుబేర్ అహ్మద్, ఫార్మాసిస్టులు లక్ష్మీనారాయణ, రమణ, అశోక్, మనోహర్, శ్రీనివాస్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ సభ్యులు, జిల్లా అధ్యక్షులు రాజు

## జంతుశాస్త్ర విద్యార్థులు క్షేత్ర పర్యటన

**మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్25 ప్రభాతవార్త:** మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఎస్సీ బీజెడ్‌సీ తృతీయ సంవత్సరం విద్యార్థులే క్షేత్ర పర్యటనలో భాగంగా మెదక్ పట్టణంలోని జిల్లా మత్స్యశాఖ కార్యాలయాన్ని సందర్శించి మత్స్యశాఖ అధికారి ఏడీ మల్లేశం ఆధ్వర్యంలో ఫిషరీస్ ఫీల్డ్ ఆఫీసర్ సంతోష్ కుమార్ చేపపిల్లల పెంపకాన్ని వివరిస్తూ నర్సరీకుంటలను, బ్రీడింగ్ కుంటలను, హచ్చింగ్ జార్‌లను చేపపిల్లల పెంపకంలో ఎలా ఉపయోగిస్తారో విద్యార్థులకు వివరించారు. జూన్, జూలైలో వర్షాకాలం ప్రారంభం కాగానే ఎదిగిన చేపలకు హార్మోన్లను ఇంజక్షన్ల రూపంలో ఇచ్చి చేప విత్తనాలను సేకరించే పద్ధతులను, చేప విత్తనాలను రైతులకు ఎలా రవాణా చేస్తారు అనే అంశాలను తెలియజేశారు. విద్యార్థుల క్షేత్రంలోని సహజ కుంటలను, బ్రీడింగ్ కుంటలను, నర్సరీ కుంటలను ప్రత్యక్షంగా వీక్షించారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారు, డిగ్రీ కళాశాల జంతు శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జె. విశ్వనాథం, వినోద్ కుమార్, నాగరాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

## పేదల పాలిట వరం అంత్యోదయ పథకం : ప్రిన్సిపాల్

**మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త:** మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంత్యోదయ దివాస్ కార్యక్రమాన్ని బుధవారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. హుస్సేన్ అధ్యక్షతన అర్థశాస్త్ర విభాగం నిర్వహించడం జరిగింది. పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 25 రోజు అంత్యోదయ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం జరుగుతుంది. అంత్యోదయ లక్ష్యం ప్రతి నిరుపేద కూడా అభివృద్ధిలో భాగంగా ఉండాలని, అభివృద్ధి ఫలాలు ప్రతి నిరుపేద వద్దకు చేరాలన్నది లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుంది. పేదరికం నిర్మూలించి నిరుపేదల ఆకలిని తీర్చడమే లక్ష్యంగా 2000 సంవత్సరంలో ఈ పథకాన్ని ప్రారంభించడం జరిగింది. సమ్మిళిత అభివృద్ధి, సామాజిక న్యాయం, సాధికారత, ఆహార భద్రత, స్థిరమైన అభివృద్ధి లక్ష్యంగా ఈ పథకాన్ని రూపొందించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. హుస్సేన్ పేర్కొన్నారు. విద్య, వైద్య సౌకర్యాలు, పౌష్టికాహారం చేకూర్చడం ప్రభుత్వ బాధ్యతగా స్వీకరించాలని, అందులో ప్రభుత్వ, ఇతర సంస్థలు కూడా చురుకైన పాత్రను పక్షసించినట్లయితే పేదరికం నిర్మూలించడం సాధ్యమవుతుందని అర్థశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ టి. మల్లేశం పేర్కొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో చరినరత విభాగాధిపతి గణపతి, రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ రాజాగౌడ్, అధ్యాపకులు దేవదాస్, నాగరాజు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## బిజెపి సభ్యత్వ నమోదుకు మంచి స్పందన

**-రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అద్దెలి రవీందర్, ఎడ్ల రమేష్**

**అమీన్‌పూర్, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త:** అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో బీజేపీ సభ్యత్వ నమోదుకు మంచి స్పందన లభిస్తుందని ఆ పార్టీ నాయకులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అద్దెలి రవీందర్, ఎడ్ల రమేష్ తెలిపారు. బుధవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా బీరంగూడలోని 164, 173వ పోలింగ్ బూత్‌లలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో సభ్యత్వ నమోదు కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తుందని, యువకులు, మహిళలు ఉత్సాహంగా సభ్యత్వం నమోదు చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రతి వార్డులోనూ పెద్దఎత్తున బీజేపీ సభ్యత్వం నమోదు చేసుకోవడం జరుగుతుందని, సభ్యత్వ నమోదుతో పార్టీ బలోపేతం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా సభ్యత్వ ఇన్‌ఛార్జి లక్ష్మీ బసవ నర్సయ్య, అమీన్‌పూర్ బీజేపీ పట్టణ అధ్యక్షులు ఆగా రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎంఈఓగా ప్రతాప్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

**పాపన్నపేట, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** మండల విద్యాధికారిగా ప్రతాప్‌రెడ్డిని నియమిస్తూ జిల్లా విద్యాధికారి ఆదేశాలు జారీచేయడంతో బుధవారం ప్రతాప్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని పొడిచన్‌పల్లి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న ప్రతాప్ రెడ్డి మండల నోడల్ అధికారిగా విధులు నిర్వహిస్తూ వస్తున్నారు. ఆయా ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు ప్రతాప్‌రెడ్డిని ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు సురేందర్‌గౌడ్, మహేశ్వర్, శ్రీనివాస్‌రావు, ఆరోగ్యం సంగం బాధ్యులు వెంకట్‌రాంరెడ్డి, పంతులు రాజు, బాలరాజు, మంగ నర్సింలు, బాల మల్లేష్, రమేష్, అనిల్, నవాజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఆర్టిజన్ మహాధర్నాను జయప్రదం చేయండి

**-టివిఏసి జెఏసి జిల్లా సంయుక్త కార్యదర్శి చంద్రబాసప్ప**

**పాపన్నపేట, సెప్టెంబరు 25, ప్రభతవార్త:** హైదరాబాద్‌లోని విద్యుత్ మింట్ కంపౌండ్‌లో ఈ నెల 26న జరిగే ఆర్టిజన్ మహాధర్నాను విజయవంతం చేయాలని మెదక్ జిల్లా టివిఏసి జెఏసి సంయుక్త కార్యదర్శి బి చంద్రబాసప్ప ఒకప్రకటనలో కోరారు. టిజిఎస్ డిసిఎల్‌లో 2200 జెఎల్ఎం పోస్టులకు యాజమాన్యం జారీచేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనేక సంవత్సరాలుగా కాంట్రాక్ట్ లేబర్‌గా ఉన్న విద్యుత్ ఆర్టిజన్ కార్మికులు గత ప్రభుత్వంలో ఆర్టిజన్‌గా గుర్తించినప్పటికి ఎలాంటి ప్రయోజనాలు అందుకోలేదని గుర్తు చేశారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టిజన్స్‌ని కన్వర్షన్ చేసి జేఎల్ఎం పోస్టులలో భర్తీ చేయాలని యాజమాన్యానికి సూచించారు. టివిఏసి జెఏసి రాష్ట్ర కమిటి పిలుపు మేరకు గురువారం ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్టిజన్ కార్మికులు మింట్ కాంపౌండ్ టిజిఎస్సి డిసిఎల్ సిఎండి కార్యాలయం వద్దకు అధిక సంఖ్యలో చేరుకుని ధర్నాను విజయవంతం చేయాలని సూచించారు.

## ఎద్దుమైలారం పంచాయతీని పరిశీలించిన డిఎల్‌పిఓ

**కంది, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఎద్దుమైలారం గ్రామ పంచాయితీని డిఎల్‌పిఓ అనిత బుధవారం పరిశీలించారు. గ్రామ పంచాయితీ ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులకు శానిటేషన్ పరికరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిఓ మహేందర్‌రెడ్డి, పంచాయితీ కార్యదర్శి శ్రీనివాసులు, నర్స్ రాజేశ్వరి పాల్గొన్నారు.

## మండల విద్యాధికారిగా శ్రీనివాస్

**సిర్గాపూర్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** మండల విద్యాధికారిగా శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సిర్గాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌ను మండల విద్యాధికారిగా బాధ్యతలు అప్పగించారు. శ్రీనివాస్ మండల నోడల్ అధికారిగా సేవలు అందిస్తున్నారు. ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌ను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## చట్టాలపై విద్యార్థులు అవగాహన ఉండాలి

**-న్యాయమూర్తి రమేష్**

**సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** విద్యార్థులు చట్టాలపై అవగాహన ఉండాలని జాతీయ న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి రమేష్ అన్నారు. బుధవారం సంగారెడ్డిలోని బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలను జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలమేరకు, జిల్లా సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి భవానిచంద్ర సూచనల మేరకు తనిఖీ నిర్వహించి విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను అందుకుని ఉన్నతులుగా ఎదగాలని సూచించారు. కళాశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గృహహింస, బాల్య వివాహ నిషేధ చట్టం, పోస్కో చట్టం, వరకట్న నిషేధ చట్టాలపై రమేష్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు, అధ్యాపకులకు న్యాయపరమైన విషయాల్లో ఉచిత న్యాయ సహాయం అందిస్తామని, సహాయం కోరేవారు సంగారెడ్డిలోని న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయాన్ని ఆశ్రయించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతు భోరోసా రెండు పంటకు వచ్చే విధంగా చూడాలి

**-ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పుర్ర మహేష్**

**కొల్చారం, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ 12వ తేదీ దసరా నుండి రైత భరోసా నిధులు విడుదల చేయడానికి సన్నాహాలు కనిపిస్తున్నాయని ఎంఎస్ఎఫ్ మెదక్ జిల్లా అధ్యక్షులు పుర్ర మహేష్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామని, కానీ రైత భరోసా వర్షాకాలం పంటలకు ఇవ్వలేదు కాబట్టి వర్షాకాలం, యాసంగి రెండు పంటలకు కలిపి ఎకరానికి 15 వేల రూపాయలు ఇచ్చి రైతులను ఆదుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

# కాంగ్రెస్ పార్టీ చిల్లర రాజకీయాలు మానుకోవాలి

**బిఆర్ఎస్ నేత గోవర్ధన్‌రెడ్డి.. కాంగ్రెస్ కౌంటర్‌కు బిఆర్ఎస్ ఎన్‌కౌంటర్.. ఇరు పార్టీల మధ్య డంపింగ్ యార్డు పంచాయితీ**

**గుమ్మడిదల, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త:** బీఆర్ఎస్ పార్టీ నేత చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సీజీఆర్ ట్రస్టు ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇరుపార్టీల మధ్య వివాదాస్పదంగా మారిన సంగారెడ్డి జిల్లా ప్యారానగర్‌లో ఏర్పాటుచేస్తున్న డంపింగ్‌యార్డు వివాదం కోసం చిల్లర రాజకీయాలు చేస్తోంది బీఆర్ఎస్ పార్టీ కాదని.. కాంగ్రెస్ నాయకులని ఎద్దేవా చేశారు. గత 2013లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో డంపుయార్డు ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేసిందని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మా ప్రాంతంలో ఏర్పాటు చేయొద్దంటూ గత బీఆర్ఎస్ పాలనో నిర్మాణం కాకుండా ఆపడం జరిగిందన్నారు. అన్ని గ్రామ పంచాఇయతీల్లో తీర్మాణాలు చేసి అప్పట్లోనే అధికారులకు, ఎమ్మెల్యేకు, జిల్లా మంత్రికి వినతి పత్రాలు ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ పార్టీదే అన్నారు. ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్న ఇచ్చిన అనుమతులకు వ్యతిరేకంగా పోరాటం చేయలేదని, ప్రస్తుతం అధికారంలో బీఆర్ఎస్ పార్టీ లేకపోయినా ఇప్పుడు డంపుయార్డు నిర్మాణం అడ్డుకోవడం కోసం పలు రకాలు ప్రయత్నాలు చేస్తుంది మేమేనని గుర్తు చేశారు. అధికారంలో ఉన్నా, లేకున్నా డంపుయార్డు వద్దంటూ యుద్ధం చేస్తుంది కేవలం బీఆర్ఎస్ పార్టీ అని అన్నారు. 2013లోనే డంపుయార్డులకు భూమి అలాట్‌మెంట్ చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం అని, పది సంవత్సరాలు డంపుయార్డును ఆపింది బీఆర్ఎస్ ప్రభుత్వమని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే డంపుయార్డు నిర్మిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ నాయకులు చిల్లర రాజకీయాలు మానుకొని అఖిల పక్షంగా పోరాటానికి ముందుకు రావాలని, అందరం కలిసిగట్టుగా డంపుయార్డును నిలిపివేద్దామని తెలిపారు. మంత్రి దామోదర రాజనర్సింహ పిలిస్తేనే మేము వెళ్లామని, డంపుయార్డుపై జరిగే నష్టం మంత్రికి పూర్తిగా వివరించామని, ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. అదనంగా గుమ్మడిదల మండలానికి 100 పడకల ఆసుపత్రి హామీ ఇచ్చారన్నారు. ఇప్పుడు ప్రభుత్వం మీదేకదా.. డంపుయార్డుని ఆపండని, అందరం సంతోషిస్తామని, మీకు సహకరించడానికి మేము సిద్ధంగా ఉన్నామన్నారు. కాంగ్రెస్ నాయకులు ఇప్పటి వరకు మంత్రికి, ఎమ్మెల్యేకు, అధికారులను కలిసి వినతి పత్రం ఇచ్చిన పాపానపోలేదన్నారు. ప్రజలు అంతా చూస్తున్నారని, త్వరలో కాంగ్రెస్ నాయకులకు గుణపాఠం చెప్పే రోజులు దగ్గర పడుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నల్లవల్లి తాజా మాజీ ఎంపీటీసీ కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి, తాజా మాజీ సర్పంచులు చిమ్ముల నరసింహారెడ్డి, కంచర్ల శ్రీనివాస్, అభిషేటి రాజశేఖర్, గడ్డం హనుమంత్ రెడ్డి, నక్క వెంకటేశంగౌడ్, ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, చిమ్ముల దేవేందర్‌రెడ్డి, వాసుదేవరెడ్డి గుండాల వెంకటేష్, యాదగిరి, తాజా మాజీ ఉప సర్పంచి మొగులయ్య, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, సంజీవరెడ్డి, సూర్యనారాయణ, పొన్నాల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

## ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి

**పెద్దశంకరంపేట, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త:** ప్రమాదశాత్తు తిరుమలాపూర్ చెరువులోపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. ఏఎస్ఐ సునీత కథనం ప్రకారం... పెద్దశంకరంపేటకు చెందిన అవుసుల శ్రీనివాస్‌చారి(58) మంగళవారం ఉదయం ఇంటి నుండి బయటకు వెళ్లాడన్నారు. శ్రీనివాస్‌చారి టైలరింగ్ పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. బుధవారం ఉదయం అతడు తిరుమలాపూర్ చెరువులో మృతదేహమై కనిపించారు. స్థానికులు కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుమారుడు మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.